


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 09-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 26 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## భవిష్యత్ భాండాగారంగా..
# భారతావనిని చూడాలి




**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాకారం చేసుకోవాలి**

**వరంగల్ నిట్ వజ్రోత్సవ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

వరంగల్: భారతదేశంలో యువశక్తికి కొదవలేదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ (ఎన్ఐటీ) వజ్రోత్సవ ప్రారంభ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 60 వసంతాల నిట్ ప్రస్థానాన్ని వివరించే సంక్షిప్త ఛాయాచిత్ర మాలికను ఆయన ఆవిష్కరించారు. 25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అల్యూమినీ కన్వెన్షన్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గతంలో ఆర్ఈసీ కళాశాలకు ప్రిన్సిపల్స్‌గా పనిచేసిన పలువురిని వెంకయ్యనాయుడు ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, నిట్ సంచాలకులు ఎన్వీ రమణారావు, ఇతర ఆచార్యులు ఈ తరువాయి 2లో..

## పంట రుణాలు అందజేతలో
# రైతులకు జాప్యం వద్దు

**భూగర్భ జలాలు సద్వినియోగించుకోండి ‖ నీరు-ప్రగతి సమీక్షలో కలెక్టర్లకు సీఎం ఆదేశాలు**



విజయవాడ: కౌలు రైతులకు పంట రుణాలు అందించటంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. నీరు-ప్రగతి పురోగతిపై సీఎం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి అనేది ఒక గొలుసుకట్టు చర్య లాంటిదని, గొలుసు ఎక్కడ తెగినా అభివృద్ధికి అవరోధం ఏర్పడుతుందని హెచ్చరించారు. వరుసగా మూడేళ్లపాటు లోటు వర్షపాతం వెంటాడినా తట్టుకుని సమర్థ నీటి నిర్వహణతో దిగుబడులు తగ్గకుండా చూశామన్నారు. వచ్చే ఏడాది గండికోటలో 20టీఎంసీల నీటిని నిల్వ చేయాలని అధికారులకు సూచించారు. భూగర్భ జలాలతో పాటు ఉపరితల జలాలను సమర్థంగా వినియోగించుకుంటేనే ప్రకృతి ఇబ్బందులను అధిగమించి అనుకున్న ఫలితాలను సాధించగలమని స్పష్టం చేశారు. అనంతపురంలో సూక్ష్మ పోషకాల పంపిణీని వేగవంతం చేస్తూ పంటలకు తెగుళ్లు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లో పంట రుణాల పంపిణీ శాతం తక్కువగా ఉందని వీటిని మరింత పెంచాలని సూచించారు. తూర్పు గోదావరిలో కౌలు రైతులకు వందశాతం పంట రుణాలు అందాయని.. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ తరువాయి 2లో..

## విశాఖ హెచ్‌పీసీఎల్‌లో అగ్నిప్రమాదం

విశాఖపట్నం: విశాఖ జిల్లాలోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. కర్మాగారంలోని ఓ ప్రాంతంలో తారుకు నిప్పంటుకోవడంతోనే ప్రమాదం సంభవించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ ఘటన కారణంగా హెచ్‌పీసీఎల్‌లో ఒక్కసారిగా సైరన్ మోగడంతో స్థానిక కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. స్వల్ప ప్రమాదమే నని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

## మహిళల బతుకు బాగుపడితేనే సమాజాభివృద్ధి

**డిసెంబర్ 12న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం**
**టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా**

షాపూర్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అభయహస్తం పథకాన్ని పునరుద్ధరిస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. షాపూర్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ మహిళా గర్జన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ ప్రసంగిస్తూ.. మహిళల బతుకులు బాగుపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని తరువాయి 2లో..



# పంచాయతీరాజ్ వ్యవస్థలో జోక్యం చేసుకోం

## జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

పోలవరం: పంచాయతీరాజ్ వ్యవస్థలో జనసేన పార్టీ జోక్యం చేసుకోబోదని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

పోలవరం పర్యటనలో భాగంగా సోమవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాజీ సర్పంచుల సమావేశంలో పవన్ మాట్లాడారు.

గత ప్రభుత్వాలు పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశాయని విమర్శించారు.

ఇందిరమ్మ కమిటీ, జన్మభూమి కమిటీ, గ్రామ సచివాలయాల పేరుతో వారి పాలనలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచే కొత్తతరం రాజకీయాల్లోకి రావాలన్నారు. సీఎం పదవి చంద్రబాబు, జగన్‌లకు వారసత్వమేమో గానీ తనకు మాత్రం బాధ్యత అని స్పష్టం చేశారు.



## ఆర్థికశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

స్టాక్‌హోమ్: రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఇద్దరు స్థూల ఆర్థిక శాస్త్రవేత్తలకు అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించింది. విలియమ్ డీ నోర్డాస్, పాల్ ఎం రోమర్‌లకు ఈ ఏడాది సంయుక్తంగా ఎకనామిక్స్ నోబెల్ దక్కింది. గ్రీన్‌హౌజ్ వాయువుల విడుదలకు కారణమైన అన్ని దేశాలపై కార్బన్ ట్యాక్స్‌లను సమంగా విధించే ఓ స్కీమ్‌ను ఆర్థికశాస్త్రవేత్త విలియమ్ నోర్డాస్ డెవలప్ చేశారు. గ్రీన్‌హౌజ్ వాయువుల నియంత్రణ కోసం నోర్డాస్ రూపొందించిన పట్టిక ద్వారా వాతావరణ విధానాలను అమలు చేయడం సులువు అవుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ, వాతావరణం మధ్య సంబంధాన్ని తెలియజేసేందుకు నోర్డాస్ క్వాంటిటేటివ్ మోడల్‌ను సృష్టించారు.

ఈ మోడల్ ఆధారంగానే ప్రస్తుతం అనేక దేశాల్లో వాతావరణ విధానాలను విశ్లేషిస్తున్నారు. దీని ఆధారంగానే కార్బన్ ట్యాక్స్‌లను కూడా విధిస్తున్నారు. గత 100 ఏళ్లలో మానవుల చర్యల వల్లే ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ఆయన తేల్చారు. మరో శాస్త్రవేత్త రోమర్.. తరువాయి 2లో..



## ఏపిఆర్‌సెట్‌లో 5.46 శాతం ఉత్తీర్ణత

### హెచ్‌ఆర్‌డి మంత్రి గంటా శ్రీనివాస రావు

ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపి రీసెర్చ్ సెట్ పరీక్ష (ఏపిఆర్‌సెట్) లో 5.46 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఫలితాలు విడుదల చేశారు.

ఏపిఆర్‌సెట్ ప్రవేశ పరీక్షకు 24082 దరఖాస్తు చేసారని, వీరిలో 20458 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. వీరిలో 1116 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. వీరిలో 815 మంది పురుషులు కాగా, 301 మంది స్త్రీలు ఉన్నారన్నారు. ఇంటర్వ్యూకు అర్హత సాధించిన విద్యార్థులు సంబంధిత విశ్వవిద్యాలయాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులు ఆధారంగా తుది ర్యాంకులు తరువాయి 2లో..




# అధినేతతో అడుగులో అడుగేస్తూ..



- పలకరించే జనం..
- పరుగులు పెట్టే అభిమానం..
- ఉరకలేసే ఉత్సాహం..
- పూలబాటలు..
- మంగళహారతులు..
- అన్నకు కష్టం చెప్పుకోవాలి
- జగన్న రావాలి..

చీపురుపల్లి : పలకరించే జనం.. పరుగులు పెట్టే అభిమానం.. ఉరకలేసే ఉత్సాహం.. ప్రతి పల్లెలోనూ ఇదే సందడి. ప్రతి మనసులోనూ అన్నొస్తున్నాడు అనే ఆనందం.. పుట్టెడు కష్టాలు చెప్పే వాళ్లు.. గుండె లోతుల్లోంచి ఆప్యాయతను పంచే ప్రజానీకం.. పూలబాటలు.. మంగళ హారతులు.. ఇవీ ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో కనిపించే దృశ్యాలు. ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు దృఢమైన సంకల్పంతో రాజన్న తనయుడు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో మరో మైలురాయి నమోదైంది. (డొంక కదులుతుందనే భయమా?)

***ప్రజాసంకల్పయాత్ర 3100 కిమీ:***

వెల్లువలా జనం వెంట నడువగా విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం ఆనందపురం క్రాస్ వద్ద ప్రజా సంకల్ప యాత్ర 3100 కిలోమీటర్ల మైలు రాయిని దాటింది. ఈ సందర్భంగా ఆనందపురం క్రాస్ వద్ద ఈ మైలు రాయికి గుర్తుగా జననేత వేప మొక్కను తరువాయి 2లో..

# ఈ పోటీలు స్ఫూర్తిదాయకం: జిల్లా కలెక్టర్



విజయనగరం: స్వచ్ఛయతే సేవా కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. సోమవారం కలక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన మాట్లాడారు. స్వచ్ఛయతే పై నిర్వహించిన వ్యాసరచన, వకృత్వం, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ఆయన మహుమతులు అందజేశారు. ఇది ప్రతిష్టాత్మకమని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పాఠశాల ఈ కార్యక్రమం అమలు చేయాలని కోరారు. వ్యాసరచనలో ప్రధమ విజేత గాజులరేగ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇప్పిలి గీతకు 10 వేల రూపాయలు, సెయింట్ ఏన్స్ గరల్స్ స్కూల్‌కు చెందిన ఆర్.హారికకు 7, 500 రూపాయలు, ది సన్ స్కూల్ విద్యార్థి కె.దోహ్యాకు 5వేల రూపాయలు చెక్కులను అందించారు.

అలాగే వకృత్వ పోటీల్లో ప్రధమ బహుమతి విజేత జెడ్పీ స్కూల్ (గరుగుబిల్లి) విద్యార్థిని ఎస్.స్వాతికి రెండవ బహుమతి విజేత సతివాడ ఎసి మోడల్ స్కూల్ విద్యార్థి అబ్దుల్ ఖాదర్, గాజులరేగ హైస్కూల్ విద్యార్థి బి.నిహారికకు ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతుల క్రింద 10వేలు, 7,500, 5 వేల రూపాయలు చెక్కులను అందజేశారు. డ్రాయింగ్ పోటీల్లో స్థానిక ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థి కె.జగదీష్‌కు, పసుపాం జెడ్పీసూక్కల్ విద్యార్థి డి.కార్తీక్‌కు ద్వితీయ కోనాడ జెడ్పీ స్కూల్ విద్యార్థి జి.మణికంఠకు 10వేలు, 7,500, 5000 రూపాయలు నగదు చెక్కును పంపిణీ చేశారు. దీనితో పాటు ధృవపత్రం, మెమోంటో కూడా అందించారు. ఈ సందర్భంగ ఆఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో ఒక పోటీలో పెద్ద బహుమతులు పొందడం చాలా ఆనందకరమని అన్నారు.

## బాధ్యతాయుతంగా వ్యవహరించండి

### మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు చైర్‌పర్సన్ సూచన

విజయనగరం : పురపాలక సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందేవిధంగా అది. కారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సోమవారం తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటికోసం ప్రజలు ఫోన్లు చేస్తుంటే ఫిట్టర్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని, ప్రజలకు జవాబుదారీగా ఉండకపోతే సహించేది లేదని హెచ్చరించారు. పన్నులు కడుతున్న ప్రజలకు సదుపాయాలు అందించడం మన బాధ్యతగా గుర్తించాలన్నారు. సున్నితమైన అంశాలను వివాదాస్పదం చేయడం మంచిపద్ధతి కాదన్నారు. అలాగే నెల్లిమర్ల పంపుహౌస్ వద్ద విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి తాము చేసిన సూచనలను ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే ట్రాన్స్‌ఫారం సమస్యను పరిష్కరించడంతో పాటు కొత్తగా మోటార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు సూచించిన పనులను ఈనెల 10వ తేదీనాటికి పూర్తిచేస్తామని గుత్తేదారులు హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులకు గుర్తు చేశారు. పనులను జాప్యం చేస్తున్నవారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. అమ్మవారి పండగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఇ మత్స్యరాజు, పలువురు ఎఇలు, కౌన్సిలర్లు మైలపల్లి పైడిరాజు, కోండ్రు శ్రీను, రొంగలి రామారావు, గేదెల ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు అభినందనలు



విజయనగరం: రాష్ట్ర రాజధానిలో జిల్లాలోకు స్వచ్ఛ ఆంధ్రా మిషన్‌లో భాగంగా అవార్డు వచ్చింది. అవార్డు గ్రహీత చీపురుపల్లి మండలం కర్లాం గ్రామ ప్రత్యేక అధికారి డిప్యూటి తహసిల్దార్ ఎ.శంకరరావు, పంచాయితీ సెక్రటరి, రిసోర్స్ పర్సన్‌లను తన ఛాంబర్‌లో అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.హరి జవహర్‌లాల్.

## భావితరానికి విద్యార్థులే ఆదర్శం

### అవనాపు విక్రం



విజయనగరం: వివేకానందుడుని, అబ్దుల్ కళాంని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విజయనగరం నియోజకవర్గం నాయకులు అవరాపు విక్రమ్ ఆకాంక్షించారు.సోమవారం జిల్లాలోని రామవరం జిల్లా పరిషత్ పాఠశాలలో 200 మంది పిల్లలకు భోజనం నిమిత్తం WAT (We Are There for Society) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్‌లు పంపిణీ చేయడం జరిగింది.సోమవారంనాడు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన విచ్చేసి పిల్లలకు స్టీల్ ప్లేట్లు, ఫ్రూట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ స్కూల్ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో WAT అధ్యక్షుడు మోహన్, జనరల్ సెక్రెటరీ గురునాధ్, వైస్ ప్రెసిడెంట్ కుమార్, మెంబర్స్ కౌసల్య, లావణ్య, రియాజ్, నవీన్, అవినాష్, చక్రవర్తి, మున్నా మైఖేల్, అభివృద్ధి వేదిక అధ్యక్షుడు మద్దిల సోం బాబు, జెడ్పీహైస్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాస రావు, వై.యస్.ఆర్.సీ.పి. వింగ్ నాయకులు నీటిపల్లి పృధ్వి మరియు బాలి యోగీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి కృషి

### మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ




విజయనగరం : క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. సోమవారం అయోధ్యా మైదానంలో 64వ స్కూల్‌గేమ్స్ (ఏపీ సీఎం కప్-2018)లో భాగంగా ఖోఖో పోటీలను, సెలక్షన్లను నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధి జరగాలన్నారు. ఎంతోమంది జిల్లా క్రీడాకారులు ఉన్న వనరులతోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక నిధులను ఖర్చు చేస్తున్నారన్నారు. క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. పట్టణంలో క్రీడలకు సంబంధించి పురపాలక సంఘం తరపున పూర్తిస్థాయిలో సహాయసహకారాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రత్యేక సదుపాయాలను, రాయితీలను కల్పిస్తున్న విషయాన్ని ప్రతీఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.వి.ప్రభావతి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ రంగబాబుదొర, ఖోఖో కోచ్ రామ్మూర్తి, ఫెడరేషన్ సభ్యులు ఇ.శ్రీనివాస్, గోపాల్, బాలకృష్ణ, రమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాబామెట్ట తాజుద్దీన్ బాబా గంధమహోత్సం.... భారీ అన్నదానం



విజయనగరం: మహోన్నతమైన సూఫీ సంప్రదాయంలో జన్మించిన మహనీయులు ఆధ్యాత్మిక చక్రవర్తి, పరమపావన మూర్తి షెహెన్ షా హప్తే అక్లిం సూఫీ మహారాజ్ సెహన్‌సా సయ్యదిన హుజూర్ హజరత్ తాజుద్దీన్ బాబా తాజుల్ ఔలియా (నాగపూర్)బాబా వారి 96వ గందమహోత్సవం సందర్భంగా స్థానిక బాబామెట్టలో వారి ప్రిక్మీశిస్యులు సెహన్సఆ ఖాదర్షా ఖాదర్ వల మమ్మా వారి సన్నిదానంలో వారి ప్రియశిస్యులు ముహమ్మద్ అలావుల్లా షా వారి మనవలు ముహమ్మద్ ఖుద్రు (15) నేతృత్వంలో ఆదివారం సుమారు 2వేల మందికి అన్నదానం జరిగింది. రాత్రి 9 గంటలకు ప్రారంభమైఐ సుమారు 1గంటకు ముగిసింది. ముందుగా బాబా కాదర్ వలి దర్గాకు వేలాదిమంది భక్తులు ఊరేగింపగా వెళ్ళారు. అక్కడముహమ్మద్ ఖుద్రు గంధం వేసి చద్దర్ పరిచారు. తదుపరి ప్రసాద వితరన చేశారు. అనంరం జగిరిగిన అన్నసమారాధనలో వేలాదిమంది బక్తుషఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబావారి ఆశీసులు అందరికి కలిగి వసుదైక కుటుంబంలో ప్రేమతో జీవితాన్ని నింపాలని..మనకోసమే కాకుండా పరులకోసం పాటుపడన నాడు మాత్రమే భక్తికి అర్ధమని దానినే ఇస్లాం బోధిస్తుదని , శాంతి, సహనం, దైవచింతన, పాపభీతి ఉండాలని పలువురు వక్తలు తెలిపారు.

## తాటిపూడి జలాశయం నుండి నీటిని విడుదల చేయించండి

### కలెక్టర్‌కి విన్నవించిన మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల

విజయనగరం : పట్టణ ప్రజల త్రాగునీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాటిపూడి జలాశయం నుండి సైఫన్ పైపులు ద్వారా నీటిని విడుదల చేయాలని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్‌కి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కి పురపాలక సంఘం తరపున వినతిపత్రం సమర్పించారు. ముసిడిపల్లి నీటిపథకం పూర్తిగా తాటిపూడి మిగులు జలాలుమీద ఆదారపడి ఉందని, తాటిపూడి నుండి గోస్తనీ నదిలోకి నీటిని విడుదల చేయకపోవడంతో ముసిడిపల్లి పథకం వద్ద నీటి పంపింగ్ సక్రమంగా జరగడం లేదని కలెక్టర్‌కి వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సైఫన్ పైపులు ద్వారా నీటిని విడుదల చేస్తే పంపింగ్ వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. తాటిపూడి జలాశయంలో ప్రస్తుతం నీటిమట్టం 271 అడుగులు వుందని, సైఫన్ పైపులు ద్వారా నీటిని ముసిడిపల్లి పథకానికి విడుదల చేస్తే రైతులకు వచ్చే ఇబ్బంది ఉండదని కలెక్టర్‌కి వివరించారు. ఈసందర్భంగా పురపాలక సంఘం తరపున వచ్చిన అభ్యర్ధనను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చైర్‌పర్సన్‌కి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

## భవిష్యత్ భాండాగారంగా భారతావనిని చూడాలి

కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు సరికొత్త పరిశోధనలు, నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ప్రజలకు ఉపయోగపడేలా, వారి జీవితాన్ని సౌకర్యవంతం చేసేలా ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలన్నారు. ప్రస్తుతం ప్రపంచం భారత్ వైపే చూస్తోందని.. ఈ దశలో మనం మరింతగా ప్రతిభా పాటవాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎంత సాధించినా.. సంస్కృతిని మరిచిపోవద్దని, ప్రకృతిని ప్రేమించడం నేర్చుకోవాలన్నారు. భారతావని భవిష్యత్ భాండాగారంగా విలసిల్లాలని ఆకాంక్షించారు. దేశంలోని వర్శిటీలు, ఐఐటీలు ఈ దిశగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు. తల్లిదండ్రులు, పుట్టిన ఊరుని, మాతృభాషను మరువద్దని.. మన భాష, యాసను పరిరక్షించుకోవాలన్నారు.

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు... వరంగల్ నగరంతో తనుకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎన్నోసార్లు ఇక్కడకు వచ్చానని... నిట్ క్యాంపస్‌లోనే బస చేశానని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు వెంకయ్యనాయుడు బతుకమ్మ శుభాకాంక్షలు చెప్పారు. నిట్ సాధించిన ప్రగతిని సంచాలకులు ఎన్వీరమణారావు తన స్వాగత ఉపన్యాసంలో వివరించారు

## పంట రుణాలు అందజేతలో రైతులకు జాప్యం వద్దు

ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. చెరువుల మరమ్మతు పనులు త్వరిత గతిన పూర్తి చేయటంతో పాటు పంటకుంటల తవ్వకాలను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మహిళల బతుకు బాగుపడితేనే సమాజాభివృద్ధి

కాంగ్రెస్ పార్టీ నమ్ముతోందన్నారు. డిసెంబర్ 12న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా మహిళా సంఘాలకు రూ.లక్ష చొప్పున గ్రాంటు అందజేస్తామన్నారు. ప్రతి మహిళా సంఘానికి రూ.10లక్షల చొప్పున రుణం అందచేస్తామని.. దానిపై వడ్డీ భారం ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు.

మోదీ పరిపాలనలో వంటగ్యాస్ రూ.970కి చేరిందని.. పెట్రోల్, డీజిల్ ధరలు చుక్కలనంటుతున్నాయని ఉత్తమ్‌కుమార్ విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఏడాదికి 6 వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న కుటుంబసభ్యుల్లోని ప్రతి మనిషికి నెలకు ఏడు కిలోల సన్నబియ్యంతో పాటు ఉప్పు , పప్పు, చక్కెర సహా 9 రకాల వస్తువులు ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా నిత్యావసర వస్తువులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికులు నెలకు రూ.2వేలు, దివ్యాంగులకు రూ.3వేల చొప్పున పింఛన్ ఇస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.

## ఆర్థికశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

*ఎండోజీనస్ గ్రోత్ థియరీని ప్రతిపాదించారు. కొత్త తరహా ఆలోచనలతో.. సుదీర్ఘకాల ఆర్థిక ప్రగతి ఎలా సాధ్యమవుతుందన్న సిద్ధాంతాన్ని రోమర్ అభివృద్ధి చేశారు. సంస్థలపై ఆర్థిక శక్తులు చూపే ప్రభావాన్ని అధ్యయనం చేసే విధంగా ఆయన కొన్ని సూత్రాలను తయారు చేశారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో సుదీర్ఘ సుస్థిర అభివృద్ధి ఎలా సాధ్యమన్న అంశాలను ఇద్దరూ విశ్లేషించారు. ప్రపంచ ప్రజల సంక్షేమం కోసం ఈ ఇద్దరు శాస్త్రవేత్తలు రూపొందించిన ఆర్థిక సూత్రాలు ఉపయోగపడుతాయని నోబెల్ కమిటీ వెల్లడించింది.*

## అధినేతతో అడుగులో అడుగేస్తూ..

నాటారు. 281 వరోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా జననేత సోమవారం గుర్ల శివారు, కలవచర్ల, కోటగంద్రేడు, పాలవలస క్రాస్, అనందపురం క్రాస్ మీదుగా గరికవలస వరకూ నేటి యాత్ర కొనసాగనుంది. పాదయాత్ర సాగిన రోడ్లన్నీ ఇరుకుగా ఉన్నాయి. దీనికి తగ్గట్టు మండుటెండ.. ఉక్కపోత. జనం ఇవేవీ లెక్కచేయ లేదు. అడుగు కూడా ఖాళీ కన్పించనంతగా జనం కిక్కిరిసిపోయారు. తమనేతను కలవాలని, కష్టాలు చెప్పుకోవాలని పోటీపడ్డారు. ఆయన రాకకోసం గంటల తరబడి నిరీక్షించారు. కిలో మీటర్ల కొద్దీ క్యూ కట్టారు. మేడలు, చెట్లు, గోడలు, స్తంభాలు.. ఎక్కారు. అక్కడి నుంచి జగన్ స్పష్టంగా కన్పించారంటూ సంతోషించారు.

పజాసంకల్ప యాత్ర ఇలా...

అధినేతతో అడుగులు వేస్తున్న రాష్ట్ర నేత బొత్ససత్యనారాయణ, మాజీ ఎంపీ వర్రపసాద్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రొగ్రామ్స్ కమిటీ కోఆర్డినేటర్ తలశిల రఘురాం వెల్లడి

వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో భాగంగా సోమవారం పాదయాత్ర వివరాలను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రొగ్రామ్స్ కమిటీ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలోని గుర్ల మండలంలోని రాత్రి బస వద్ద ప్రారంభమై గరికవలస వరకు పాదయాత్ర సాగుతుందన్నారు. చీపురుపల్లి నియోజకవర్గం గుర్ల మండలం రాత్రిబస వద్ద ఉదయం 7.30 గంటలకు పా దయాత్ర ప్రారంభమై కలవచర్ల, కోట గంద్రే డు, పాలవలస క్రాస్ వరకూ సాగుతుందని తెలిపారు. అక్కడి నుంచి మధ్యాహ్న భోజన విరామానంతరం ఆనందపురం క్రాస్, గరికవలస చేరుకుని ముగుస్తుందన్నారు.

బహిరంగ సమావేశం స్థల పరిశీలన

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం నాలుగురోడ్ల కూడలి వద్ద బుధవారం సాయంత్రం జరగనున్న బహిరంగసభ స్థలాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ప్రొగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా బొత్స అప్పలనర్సయ్య మాట్లాడుతూ, గజపతినగరం మండలంలోని కెంగువలోకి మంగళవారం పాదయాత్ర ప్రవేశిస్తుందని చెప్పారు. అనంతరం ముచ్చర్ల వద్ద భోజన విరామం ఉంటుందన్నారు. అక్కడ నుంచి జిన్నాం, లింగాలవలస మీదుగా పాదయాత్ర సాగుతుందన్నారు. పదో తేదీన కొత్త శ్రీరంగరాజురం, ఎన్‌జీఆర్ పురం మీదుగా గజపతినగరం చేరుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం ఆదినారా యణ, మండల సురేష్, పల్లి సంజీవరావు, చందమామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏపిఆర్‌సెట్‌లో 5.46 శాతం ఉత్తీర్ణత

వెల్లడిస్తారన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఇంటర్వ్యూ ప్రక్రియ ముగించి నవంబర్ 20వ తేదీ నాటికి ప్రవేశాల ప్రక్రియను పూర్తిచేయాలని నిర్ణయించామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆగష్టు 24 నుండి 28వతేదీ వరకు తెలుగు రాష్ట్రాలలోని 9 నగరాలలో పరీక్షను నిర్వహించామన్నారు. మొత్తం 70 సబ్జెక్టుల్లో పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. అర్హత శాతాన్ని జనరల్ విద్యార్థులకు 45గా, ఎస్సీ, ఎస్టీ, బిసి, పిడబ్ల్యూడి విద్యార్థులకు 40 శాతంగా తగ్గించడం జరిగిందన్నారు. అర్హత శాతాన్ని 5 శాతం తగ్గించడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, అంబేద్కర్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.రాంజీ, ఏపిఆర్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



**వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంటు జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షునిగా బర్కత్ ఆలీని నియమించడంతో విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నిచ్చి దుశ్శాలువతో సత్కరిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ విశాఖ పార్లమెంటు జిల్లా మైనారిటీ విభాగం అద్యక్షుడు బర్కత్ అలీ. ఈ చిత్రంలో అబ్బాస్, మైనారిటీ విభాగం నాయకులు ఉన్నారు.**

# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని

## తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి ఆఫీస్ వద్ద కార్మికుల ధర్నా

విశాఖపట్నంః ఆంధ్రరాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఈ నెల 4వ తేదీ నుండి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. నేటికి ఐదు రోజులు అవుతున్న ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సిఐటియు నగర కార్యదర్శి పి.మణి విమర్శించారు.

సోమవారం స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆఫీస్‌కు ఎంవిపి రైతుబజారు నుండి భారీఎత్తున కార్మిక ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం కార్మికుల సమస్యలపై చర్చించడానికి ఖాళీ లేదన్నారు. కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే పోలీస్‌లతో అరెస్టులు చేయించడం దుర్మార్గమన్నారు. ప్రైవేట్‌కార్మికులతో పనిచేయించి మున్సిపల్ కార్మికుల సమ్మె నీరిగార్చే పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరించడం సరైనది కాదన్నారు.

కార్మికులకు నష్టదాయకమైన జివో నెంబరు 279ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జివో వల్ల ప్రజలపై భారాలు కూడా పడతాయి. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకిచ్చిన అధికారాలు కాలరాయబడతాయి. "ప్రజారోగ్యం - పౌర సేవలు" ప్రభుత్వ బాధ్యత అని రాజ్యాంగం 47వ ఆర్టికల్ చెబుతోంది. కాని వాటి నుండి తప్పించుకొని కాంట్రాక్టర్ల పరం చేయటం ద్వారా రాజ్యాంగాన్ని ఉల్లంఘించబడుతుంది. ప్రజాధనాన్ని దుర్వినియోగపరిచే 279 జివో ను తక్షణమే రద్దుచేయాలని కోరుతున్నాము. శాశ్వత స్వభావం కలిగిన విధుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ / అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన వేతనాలు చెల్లించాలని సుప్రీం కోర్టు సివిల్ అప్పీలు నెం 213/2013లో పేర్కొన్నది. దీనిని తక్షణమే అమలు చేయాలి. అప్పటి వరకు 18000 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని కోరుతున్నాము. 151 జివో ప్రకారం కార్మికులకు ఏరియర్స్‌తో పాటు 12000 రూపాయలు జీతం అమలు చేస్తామని చెప్పి నేటికీ ఏడాది పూర్తియినా అమలు చేయడం లేదు. తక్షణమే దీనిని అమలు చేయాలి. కార్మికులకు పని భద్రత కల్పించాలి. పనిముట్లు ఇవ్వాలి. సబ్బు, కొబ్బరినూనె, గ్లౌజ్‌లు విధిగా ఇవ్వాలి.

హెల్త్‌కార్డులు అమలు చేయాలి. జనాభా ప్రాతిపదికన సిబ్బందిని పెంచి పారుశుద్యాన్ని మెరుగుపర్చాలి. కార్మికులకు మస్తరు పాత పద్దతిలోనే అమలు చేయాలి. ఉద్యోగులకు 010 పద్దు వేతనాలు ప్రభుత్వమే చెల్లించాలి.

ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి ఎ.సింహాచలం, మున్సిపల్ నాయకులు కె.కుమారి, జె.ఆర్.నాయుడు, చెల్లయ్యమ్మ, లక్ష్మి, రమణ, రాజు, ఐసినాయుడు, విజయ, అప్పారావు తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఝాన్సీ ఎంపిక



శ్రీకాకుళం జిల్లా : రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడా పోటీల ఎంపికలు టెక్కలి ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ ఎంపికలలో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండలంలో గల పెద్దపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న శనగల ఝాన్సీ రాణి 55 కేజీల విభాగంలో స్నాచ్, క్లీన్ జర్క్‌లో ఎనభై ఐదు కేజీలు బరువుని ఎత్తి రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక కాబడింది, ఈమె ఎంపికపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ కాసుల బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు అయినా గుండా బాల మోహన్, పాఠశాల ఉపాధ్యాయులైన శ్రీనివాస రావు, సత్యవతి, పావని, అప్పల నాయుడు, ఝాన్సీ లక్ష్మి, సూర్య నారాయణ, సన్యాసి నాయుడు, సురేష్ నీలిమ, రవిబాబు, క్రాఫ్ట్ బి త్రివేణి, పెద్దపాడు వెయిట్ లిఫ్టింగ్ కోచ్ అప్పన్న ఆమెకు ప్రత్యేక అభినం దనలు తెలిపారు. చివరగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆమెకు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## చంద్రన్న బీమా అందజేత



కంచరపాలెం : జివియంసి 41 వ వార్డు పరిధి శ్యామ్ నగర్ కోలని వద్ద ఇటీవలే ఆనారోగ్యంతో మృతి చెందిన పసుపురెడ్డిక కామేష్ (45) కుటుం బానికి చంద్రన్న భీమ ద్వరా 5000/- రూపాయల చెక్కు ను వార్డు టీడీపి వార్డు నాయకులు పెంటకోట అజయ్ బాబు బాధిత కుటుం బం సభ్యులకు సోమవారం అందజేశారు.

# ఎస్డీఐలో ముగిసిన ఇంటెలిజెంట్ సొల్యూషన్ డిజైన్ కార్యశాల



ఆరిలోవః స్థానికంగా వున్న స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్‌లో పట్టభద్రులైన అభ్యర్థుల కోసం సెప్టెంబరు 30 మరియు అక్టోబరు 7న నిర్వహించిన రెండు రోజుల ఇంటెలిజెంట్ సొల్యూషన్ డిజైన్ కార్యశాల ముగిసింది. వివిధ కళాశాలలకు చెందిన 32 మంది అభ్యర్థులు పాల్గొని డాటా క్రమబద్దీకరణ, లాజిక్ అనుసరణ, వివిధ సమస్యల సులభ పరిష్కరణలపై ఆధునిక శాస్త్ర పద్ధతులను తెలుసుకున్నారు. చివరిగా చెన్నైలోని జాతీయ ఉత్పాదకత మండలి నిర్వహించిన ఆన్ లైన్ పరీక్షలో పాల్గొని ధృవీకరణ పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా, సంస్థ ఇంచార్జ్ సీ.వీ.నరసింహ దాసు మాట్లాడుతూ, నేటి యువతలో ఉపాధి కల్పనకు కావలసిన అంశాలను అధ్యయనం చేసి, వాటిని ఉచితంగా అందించడమే ధ్యేయంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చిన చెన్నైకి చెందిన డాక్టర్ ఉపాసన, డాక్టర్ ఆనంద్, డాక్టర్ అనిరుద్ధలను అభినందించారు.

# సంపూర్ణ ప్రజాస్వామ్యంతోనే దేశాభివృద్ధి

## ఏయూ వీసీ ఆచార్య జి. నాగేశ్వరరావు



ఆంధ్ర విశ్వవిద్యాలయంః సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆంధ్రవిశ్వకళాపరిషత్ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం ఏ.యూ. యు.జి.సి. మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన "సంపూర్ణ ప్రజాస్వామ్యం" గ్రంథావిష్కరణసభలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాజీ డిఫెన్సీ అకౌంట్స్‌సర్వీస్ అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన ఈ గ్రంథంలో రాజకీయ ప్రజాస్వామ్యం ద్వారానే ఈ దేశంలో సమసమాజ నిర్మాణం సాధ్యమని ఆయన నినదించారు. మహిళలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాకవర్గాలు, ఎస్సీ,ఎస్టీ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే జాతీయ, ప్రాంతీయ రాజకీయపార్టీలు అన్ని స్థాయిల ఎన్నికల్లోనూ జనాభాప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆయన వివరించారు. అంతేగాకుండా స్వాతంత్ర్య కాలం నాటి నుంచి నేటివరకు దేశంలో జరుగుతున్న రాజకీయ తప్పిదాలకు అడ్డుకట్టవేసేదిశగా ఆయన తన రచన కొనసాగించారు. కుల,మత, లింగ, ప్రాంతాలుగా విభజన చెందిన ఈదేశంలో ఆయా ప్రజల నుంచి రాజకీయ సమప్రాతినిధ్యానికి గల అవసరతను ఆయన సోదాహరణగా వివరించారు.

ఈ కార్యక్రమంలో ఏయూ యుజిసి మానవనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకులు ఆచార్య పి.విశ్వనాథం, ఉప సంచాలకులు ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, నిరుద్యోగభృతి నోడల్ అధికారి డాక్టర్ ఎస్.హరనాథ్, ప్రాంతీయ సినిమా సెన్సార్‌బోర్డు సభ్యులు నరవప్రకాశరావు, జర్నలిజంశాఖ పోస్ట్‌డాక్టరల్ పరిశోధకుడు డాక్టర్ జికెడి ప్రసాద్, ఫార్మశీశాఖ పరిశోధకుడు డాక్టర్ జి. సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యూట్ మిల్ తెరవాలని ధర్నా

భీమునిపట్నంః చిట్టివలస జ్యూట్ మిల్ మూసివేసి 10ఏళ్ళు అయిననూ ఇంత వరకు తెరవలేదని జ్యూట్ మిల్ తెరవాలని స్థానిక జంక్షన్‌లో సిఐటియు, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు మాట్లాడుతూ చిట్టివలస జ్యూట్ మిల్ మూసివేసి 10 ఏళ్ళు అయిననూ ఇంత వరకూ తెరవకపోవడం బాధాకరమని తెలిపారు. ఏళ్ళు గడుస్తున్నా మిల్ విషయం లో కాలయాపన చేయడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. అంతే కాకుండా కార్మికులకు రావలసిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేసారు. జనసేన పార్టీ నాయకులు అలీవర్ రాయ్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కార్మికుల సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం జనసేన ఈ ధర్నాలో పాల్గొన్నాదని. గత ఎంఎల్‌ఎ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రస్తుత ఎం.ఎల్.ఎ గంటా శ్రీనివాసరావులు కార్మికులను మోసం చేశారని అన్నారు. వీరికి పదవులు మీద వ్యామోహమే గాని ప్రజా సమస్యలపై కాదని విమర్శించారు. గంటా మంత్రి గా ఉండి తన ఆస్తులు పెంచుకోవటానికే సమయం కేటాయించారు గాని కార్మికుల పస్తులు ను చూడలేకపోయారు. 60 కోట్లు కేటాయిస్తే మిల్ మళ్ళీ పునఃప్రారంభం చేయొచ్చు. కానీ ప్రభుత్వం చిత్తశుద్ధి లోపం వల్లనే ఈ నిధులు కెటాయించట్లేదని ఇది కేవలం మిల్లు ఆస్తులు తాము స్వాధీనం చేసుకోడానికి కుట్ర మాత్రమే.రాబోయో రోజుల్లో వీరికి ప్రజా వ్యతిరేకత తప్పదని ఆలీవర్ హెచ్చరించారు. లాకౌట్ అనంతరం కార్మికులకు రావాలిసిన బకాయిలను యాజమాన్యం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న తీరును నిరసన వ్యక్తం చేశారు. మిల్లి తెరిపించి బకాయిలు చెల్లించి జ్యూట్ కార్మికులకు న్యాయం జరిగే వరుకు జనసేన మిత్రపక్షలతో కలిసి పోరాటం చేస్తుందని అలివర్ ప్రకటించారు. ఈ నెలాఖరులో జ్యూట్ మిల్ నుంచి విశాఖ కలెక్టర్ ఆఫీస్ వరకూ పాదయాత్ర చేయనున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, అధ్యక్షులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, చోడవరం జనసేన నాయకులు పి వి ఎస్ ఆన్ రాజు, స్థానిక జనసైనికులు శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంగివలసలో చోరీ

## బంగారం, వెండి, రూ. 5 వేల నగదు

భీమునిపట్నంః సంగివలసలో చోరీ జరిగిన సంఘటన లో బంగారం, వెండి ,నగదు పోయినట్లు భీమిలి క్రైం ఎస్.ఐ మధుసూదనరావు తెలిపారు. సంగివలస సుఖీభవ లే అవుట్ లో సతీష్ కుమార్ అనే వ్యక్తి తన తల్లి నూకరత్నంతో నివాసం ఉంటున్నారు. కాగా కొద్ది రోజుల క్రితం క్యాంపు వెళ్ళారు. అయితే ఆదివారం వీళ్ళు ఉంటున్న ఇంటి తాళాలు విరగ్గొంటి ఉండడం చూసిన పక్కింటి వారు నూకరత్నానికి ఫోన్ చేసారు. కాగా ఆవిడ పెద్ద కుమారుడు వచ్చి చూడగా బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం, రెండున్నర తులాల వెండి, రూ. 5 వేల నగదు పోయినట్లు పోలీసులకు చెప్పారు. ఎస్.ఐ.మధుసూదనరావు, క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దొర యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ గ్రామం

భీమునిపట్నంః భీమిలి మండలంలోని తాటితూరు గ్రామంలో ఉన్న దొర యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ గ్రామం కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామంలో ముందుగా రోడ్లు, కాలువలు శుభ్రం చేశారు. అడ్డంగా ఉన్న ముళ్ళ చెట్లును తొలగించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పల్లంటి రాజేశ్వరి మాట్లాడుతూ మన ఇంటిని శుభ్రం చేసుకునేవిధంగా గ్రామంను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జై భీం యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భాగస్వామ్యాన్ని భారత్ విశ్వసిస్తుంది

## పూర్వదౌత్యవేత్త అచల్ కుమార్ మల్హోత్ర



ఆంధ్ర విశ్వవిద్యాలయంః భారత దేశం ఇతర దేశాలతో భాగస్వామ్య విధానాలను అవలంభించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని భారత దేశ పూర్వ దౌత్యవేత్త అచల్ కుమార్ మల్హోత్ర అన్నారు. సోమవారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో సార్క్ అధ్యయన కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ' ఇండియాస్ ఫారిన్ పాలసీ కరెంట్ ప్రయారిటీస్ అండ్ రిలవెన్స్ ఆఫ్ సార్క్' అంశంపై ప్రసంగించారు. భారత్ కూటమిగా పనిచేయడం కంటే భాగస్వామ్యంతో పనిచేయడానికి ఆసక్తి చూపుతుందన్నారు. కూటమిలో కొన్ని నిర్ణయాలు వేరొకరు వ్యతిరేకించడం జరుగుగుతందన్నారు. భారత్ ఎన్నడూ దౌత్య విధానాలలో దూకుడుగా వ్యవహరించలేదన్నారు. అమెరికా, రష్యాలతో తనసంబంధాలను బలోపేతం చేయడం ద్వారా భారత్ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కొనసాగిస్తోందన్నారు. మన దేశం చర్చలకు, సంప్రదింపులకు ప్రాధాన్యం ఇస్తుందని, ఇతర సందర్భాలలో సర్జికల్ స్ట్రైక్ తరహాలో సమాధానం ఇస్తుందన్నారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య సయోధ్యకు, సమస్యల పరిష్కారానికి సార్క్ ఎంతో కీలకంగా నిలుస్తుందన్నారు.

వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు మాట్లాడుతూ భారత దేశం అనుసరిస్తున్న దౌత్య సంబంధాలు భారత దేశ అభివృద్ధికి ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు మాట్లాడుతూ భారత దేశ విదేశీ విధానాల ప్రాధాన్యతను వివరించారు. సార్క్ కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం.ప్రసాద రావు కేంద్రంలో చేపడుతున్న పరిశోధన సంబంధ అశాలను తెలియజేశారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య డి.పుల్లారావు, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య టి.శోభశ్రీ, డిసిఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జి.సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. సెంటర్ ఫర్ సార్క్ స్టడీస్ ఆచార్యులు వి.శ్రీమన్నారాయణ మూర్తి సమన్వయం చేశారు.కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు ఆయన సమాధనమిచ్చారు. వర్సిటీ తరపున అచల్ కుమార్ మల్హోత్రాను సత్కరించారు.

# కారం కొట్టిన బ్యాచ్ దొరికేశారు

**- 598.67 గ్రాముల బంగారం - రూ.15.79 లక్షలు నగదు - ఒక పిస్టల్ స్వాధీనం**

**పదిమంది అరెస్టు... ఐదుగురు పరారీ**






విశాఖ క్రైం : కంట్లో కారం జల్లి దోపిడీ చేసిన ఘటనలో 10మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఐదుగురు పరారీలో వున్నారు. వారి నుంచి 598.67 గ్రాముల బంగారం, రూ.15.79 లక్షలు, ఒక పిస్టల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీ మహేష్‌చంద్ర లడ్డా కేసు వివరాలు వెల్లడించారు. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయం రోడ్డులో గత నెల 23వతేదీ తెల్లవారుజామున కంట్లో కారం జల్లి వారి వద్ద వున్న రూ.42లక్షల నగదు, 1200 గ్రాముల బంగారం దోచుకుని అక్కడి నుంచి పరారైన సంగతి తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన టూటౌన్ పోలీసులు కేసును ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ఏ వన్ నిందితుడు గోగాడ గోవింద్‌గా నిర్ధారించారు. నిందితుడు గోవింద్ గాజువాక జిఆర్‌టి జ్యూయలర్స్, హీరాపన్నా గోల్డ్ షాపులలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతను క్రికెట్ బెట్టింగ్ వ్యసనపరుడు. ఇందుకోసం 5.5 లక్షల రూపాయల వరకూ అప్పులపాలయ్యాడు. దాంతో, ఆ అప్పులను తీర్చుకునేందుకు దొంగతనాన్ని ఆశ్రయించాడు. అతనికి బంగారం వ్యాపారి రమేష్ గురించి అతని డ్రైవర్ వర్రి సురేష్ పూర్తి సమాచారం అందించారు. సురేష్, గోవింద్ ఇద్దరిదీ పక్క పక్క గ్రామాలు కావడంతో ఆ పరిచయంతో రమేష్ వద్ద నుంచి నగదు, బంగారం చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. దీనికి సంబంధించి మూడు పర్యాయాలు చోరీకి యత్నించిన గోవింద్ చివరి ప్రయత్నంలో విజయవంతమయ్యాడని పోలీసులు తెలిపారు. రమేష్ పూర్తి వివరాలను తెలుసుకున్న మీదటే తెల్లవారుజామున ఆయన వెళ్తున్న సందర్భంలో నగదును, బంగారాన్ని కంట్లో కారం కొట్టి గోవింద్ బృందం చోరీ చేయగలిగింది. ఈ కేసులో మొత్తం 15మంది నిందితులుగా పోలీసులు తేల్చారు.

రమేష్ ఇంటివద్దకు నిందితులంతా కలిసి మోటార్ బైకులపై చేరుకున్నారు. రమేష్ రైల్వేస్టేషన్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎ టూ, ఫోర్, ఫైవ్ నిందితులు వెంబడించారు. దొండపర్తి ఫ్లైఓవర్ వంతెన దిగువకు రాగానే ఈ ముగ్గురూ ఒక్కటై రమేష్ వాహనాన్ని అడ్డగించారు. ఏ 4 నిందితుడు కారాన్ని కంట్లో కొట్టేసి సూట్ కేసును, బంగారాన్ని గోవింద్‌తో సహా, మిగిలిన నిందితులంతా కలిసి దోచుకున్నారు. ఆ తరువాత వారంతా చోరీ సొత్తుతో సిటీ నుంచి పరారయ్యారని పోలీ సులు వివరించారు. సీసీ పుటేజ్ ఆధారంగా నిందితుల కదలికలను పోలీసులు గమనించి దర్యాప్తును ప్రారంభించారు. క్రైం సిఐ కృష్ణారావు తన సిబ్బందితో ఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. బాధితుడు రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పదిహేను రోజుల వ్యవధిలో ఈ కేసును ఛేదించగలిగారు. నిందితుల నుంచి 598.67 గ్రాముల గోల్డ్ బిస్కట్లు, 15.79 లక్షల రూపాయల నగదును, ఆరు రౌండ్లు కలిగిన తుపాకీని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. మొత్తం పదిహేను మంది నిందితులలో పదిమందిని పోలీసులు అరెస్టు చేయగా, ఖరగ్‌పూర్‌కు చెందిన మరో ఐదుగురు పరారీలో వున్నారు. ఈ విలేకర్ల సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు దామోదర్, సురేష్‌బాబు తదితర సిబ్బంది పాల్గొన్నారు. బంగారు వ్యాపారి రమేష్‌బాబు విశాఖలోని శ్రీనగర్‌లో సాయి ప్యారడైజ్ అపార్టుమెంట్‌లోని ఐదవ అంతస్తులో వుంటున్నాడు. వ్యాపారం నిమిత్తం విశాఖకు వస్తుంటారు. రమేష్‌బాబుతో పాటు డ్రైవర్ కూడా ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక టీమ్స్ రంగంలోకి దిగాయి. దోపిడీ ముఠా బండి వివరాలు, ఏయే ట్రాఫిక్ సిగ్నల్స్ నుంచి వెళ్లారు అనే విషయాలు బయటకు తీస్తున్నారు. ఇంతకు బరి తెగించారు. అంటే, వీళ్ల మామూలు దొంగలు కాదని, దోపిడీలు చేసే దాకి దోపిడీ ముఠాగా భావిస్తున్నారు పోలీసులు. పరారీలో వున్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

అరెస్టు అయిన 10మంది... : మద్దిలపాలెంకు చెందిన గోగాడ గోవిందరావు, కోయిలాడ సాయి కిరణ్, సాది హరిబాబు, మానాపురం మురళీకృష్ణ, పాలా భాస్కర్, కొండపు దిల్లేశ్వరరెడ్డి, కంద్రపు సౌమిత్, సాలిపేటకు చెందిన సురహరిదీక్షితరావు, తోటాడ లోకేష్, మొద్దు తారకేశ్వరరావు.

పరారీలో వున్న ఐదుగురు... : ఖర్గపూర్‌కు చెందిన మనోజ్ దాస్, గణశ్యామ్, సుమీర్‌దాస్, గేదం సూరజ్‌కుమార్, రాకేష్‌మండా వున్నారు.

## డయల్ యువర్ కమిషనర్‌కు 8 ఫిర్యాదులు



విశాఖపట్నం : జి.వి.యం.సి ప్రధాన కార్యా లయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800- 4250-0009) కార్యక్రమానికి 8 ఫిర్యాదులు అందాయి.


## ప్రకటన

నెం. 130531085 సిటి (జిఢి) కోగేశ్వరరావు బుర్డి 47 బిఎన్ ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీసు దళం, సన్‌ఆఫ్ ఎస్‌హెచ్. మోడు బుర్డి, బెనల్‌బేడు - గ్రామ, పిఒగీ-బెనల్‌బేడు, టెహ్ - అరకు వ్యాలీ, పిఎస్ - అరకువ్యాలీ, జిల్లా - విశాఖపట్నం రాష్ట్రం - ఆంధ్రప్రదేశ్ (531149) వాస్తవ్యుడయిన ఇతను 10.04.18 (మధ్యాహ్నం) నుంచి ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా గైర్హాజరు అయినాడు. సదరు అధికారి అతనని ఉద్యోగానికి రిపోర్టు చేయమని కోరడమైనది. అయినప్పటికీ అతను ఈ రోజు వరకు రిపోర్టు చేయలేదు. ఆ విధంగా సిఓఐ జారీ చేయబడి, అతను శాఖా ఆర్డరు నెం. 1740 తేది 09.06.18 ప్రకారం 11.04.18 (మధ్యాహ్నం) నుంచి పారిపోయిన సిపాయిగా చాటబడినది.

నీవు ఈ ప్రకటన వెలువడిన 30 రోజులలోపు నీ విధులకు రిపోర్టు చేయవల్సిందిగా తెలుపడమైనది. లేనిచో అతను తన విధుల నుంచి ఎటువంటి ప్రకటనలు లేకుండా తొలగించడం జరుగుతుంది.

కమాండెంట్

davp 19112/11/0194/1819 — 47 బిఎన్ ఐటిబి పోలీసు

# విజయభాను

## సంపాదకీయం

## భారత్ గగనతల సామర్థ్యం

రష్యా నుంచి ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా భారత్ తన స్వతంత్ర విధానాన్ని ఎవరూ ప్రభావితం చేయలేరని ఢంకా బజాయించి చెప్పినట్టయింది. మన దేశం సందర్శించిన రష్యా అధినేత వ్లాదిమిర్, ప్రధాని నరేంద్ర మోదీ ఈ అత్యంత ప్రాధాన్యం గల ఒప్పందంపై సంతకాలు చేయడాన్ని ప్రపంచవ్యాప్తంగా దౌత్యవేత్తలు ఆసక్తిగా గమనించిన సందర్భమిది. ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి సోవియెట్ యూనియన్ నుంచి ఆ తర్వాత రష్యా నుంచి ఆయుధాలను సమకూర్చుకోవడం భారత్‌కు కొత్తేమీ కాదు. కానీ రష్యా నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తే, ఆంక్షలు విధిస్తామంటూ అమెరికా కొరకొరా చూస్తుండగానే, భారత్ నిర్భీతిగా ఈ ఒప్పందం కుదుర్చుకోవడమే విశేషం. అమెరికా శత్రువులను తిప్పికొట్టడానికి ఆంక్షలు విధించే చట్టం (కాట్‌సా) అనే కొత్త చట్టాన్ని అమెరికా తయారుచేసి పెట్టుకున్నది. ఈ చట్టం ప్రకారం ఇరాన్, ఉత్తరకొరియా, రష్యా దేశాల నుంచి ఎవరు భారీ లావాదేవీలు జరిపినా ఆంక్షలు విధిస్తామంటూ బెదిరిస్తున్నది. కానీ భారత్ అభివృద్ధికి రష్యా, ఇరాన్ దేశాలతో సంబంధాలు తప్పనిసరి. పశ్చిమాసియా, మధ్య ఆసియా దేశాలతో సంబంధాలకు పాకిస్థాన్ అడ్డంకిగా మారిన నేపథ్యంలో ఇరాన్ మార్గం భారత్‌కు అత్యవసరం. ఇంధన సరఫరాలో కూడా ఇరాన్ మైత్రి ఉపయోగకరం. మరోవైపు భారత్ శాస్త్ర, సాంకేతిక, రక్షణ రంగాల్లో నిలదొక్కుకోవడానికి కారణం రష్యానే. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో మనకు నమ్మదగిన మిత్ర దేశం రష్యానే. పశ్చిమ దేశాలు ఇవ్వడానికి నిరాకరించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పదేపదే రష్యా అందిస్తూ వస్తున్నది. కాల పరీక్షకు నెగ్గిన మిత్రులను అమెరికా కోసం పణంగా పెట్టడానికి నిరాకరించి భారత్ రష్యా నుంచి ఎస్- 400 రక్షణ వ్యవస్థలను కొనుగోలుకు సిద్ధపడటం మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని చాటుకోవడమే. అమెరికా బెదిరింపులను ఏ మాత్రం ఖాతరు చేయకుండా భారత్ ఎస్-400 రక్షణ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోవడానికి కార ణం అమెరికాను పనిగట్టుకొని అవమానించాలని కాదు. ఎస్- 400 అనేవి ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన రక్షణ వ్యవస్థలు. శత్రు దేశం బాంబులు కురిపించే విమానాలు, క్షిపణులు మొదలైనవి అనేకం ఎత్తున దూసుకొస్తున్నప్పుడు వాటిని వెయ్యి కిలోమీటర్ల దూరంలోనే పసిగట్టి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలోనే ధ్వంసం చేయడం ఈ ఎస్-400 విశిష్టత. ఇందులోని నాలుగురకాల వ్యవస్థలు నాలుగు అంచెలలో కాప లా ఉంటూ డజన్ల కొద్దీ క్షిపణులను ఆకాశంలోనే పటాకలు పేల్చినట్టు పేల్చగలవు. ఒక్కో వ్యవస్థ డజన్ల కొద్దీ క్షిపణులను ధ్వంసం చేయగలదు. చైనా కూడా ఇదే వ్యవస్థను రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నది. టర్కీ, ఖతర్‌లు కూడా ఇదే బాటలో ఉన్నాయి. పాకిస్థాన్ అణ్వాయుధాలను, క్షిపణులను తయారుచేసుకున్న నేపథ్యంలో మనకు ఎస్-400 పటిష్టమైన భద్రతను కల్పిస్తాయి. ఒక్క ఎస్-400 దిగుమతికే పరిమితం కాకుండా భారత్ అత్యాధునికమైన, అమెరికా యూరప్ దేశాలు దాచిపెట్టుకున్న ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రష్యా నుంచి పొందడానికి ప్రాధా న్యం ఇవ్వాలె. మన దేశానికి రష్యా తర్వాత అతిపెద్ద ఆయుధ సరఫరాదారు అమెరికానే. ఇటీవలి కాలంలోనే భారీ ఎత్తున అమెరికా నుంచి రక్షణ సామాగ్రి కొనుగోలుకు భారత్ ఒప్పందం కుదుర్చుకున్నది. అయినా భారత్‌పై వాణిజ్య ఆంక్షలు విధించడమే కాకుండా, ఇతర దేశాల దిగుమతులను అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. మన దేశ భద్రతను పణంగా పెట్టి అమెరికా ను మెప్పించడం ఏనాటికీ సాధ్యమయ్యే పనికాదు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో భారత్ అనుసరిస్తున్న అలీనవిధానం ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందింది. ఇటీవలికాలంలో దౌత్య పరిభాషలో వ్యూహాత్మక స్వతంత్రత (స్ట్రాటజిక్ అటానమీ) అనే పదం ప్రాచుర్యం పొందుతున్నది. భారత్ కొన్నేండ్లుగా అమెరికాతో సన్నిహితంగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో రష్యా, ఇరాన్ తదితర మిత్రదేశాలను దూరం చేసుకుంటుందా? అమెరికా ఉపగ్రహంగా మారుతుందా లేక వ్యూహాత్మక స్వతంత్రతను పాటించగలుగుతుందా అనే ఆసక్తి అంతర్జాతీయ విశ్లేషకుల్లో వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో భారత్ ఏ దేశ ఒత్తిడులకు లొంగకుండా స్వతంత్రంగా వ్యవహరించడం ప్రశంసనీయం. భారత్ అన్నిదేశాలతో సత్సంబంధాలను నెరుపుతున్నది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనాతో నిమిత్తం లేకుండా ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాలతో ఒక కూటమిగా ఏర్పడ్డది. కానీ ఈ కూటమి చైనాకు వ్యతిరేకం కాదని స్పష్టం చేసింది. మరోవైపు చైనా, రష్యా ప్రాబల్యం కలిగిన షాంఘై సహకార సంస్థలో చేరింది. ఫ్రాన్స్, జర్మనీ దేశాలతో సత్సంబంధాలను పెంచుకున్నది. చైనాతో కయ్యానికి దిగవలసిన సందర్భంలో ఎంతో సమతుల్యతతో వ్యవహరించి సంబంధాలను కాపాడుకున్నది.

## జగనన్న నవరత్నాల పథకాలతో ప్రజల సమస్యలు తీరుతాయి

### వైఎస్ఆర్‌సిపి యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త యువి రమణమూర్తి రాజు



అచ్యుతాపురం: జగన్ మోహన్ రెడ్డి సీఎమ్ అయితే ఎటువంటి కమిటీలు లేకుండా నవరత్నాల పథకాలతో ప్రజల సమస్యలు తీరుతాయని వైఎస్ఆర్‌సిపి యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త యువి రమణమూర్తి రాజు (కన్నబాబు) అన్నారు. సోమవారం మండలంలో జగన్నాథపురం, తిమ్మరాజుపేట గ్రామాలలో రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి నవరత్నాల పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న రాజ్యం రావాలంటే జగన్ ముఖ్య మంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి యువ నాయకులు మాజీ డిసిసిబి చైర్మెన్ యు.సుకుమారవర్మ (తేజ), వైఎస్ఆర్‌సిపి జిల్లా యువజన అద్యక్షులు లాలం రాంబాబు, మండల పార్టీ అద్యక్షులు మారిశెట్టి సూర్యనారాయణ, మాజీ ఎమ్‌పిపి వడిశల శ్రీనివాసరావు, నర్మాల కుమార్, పిన్నమరాజు వాసు, భీముని వెంకటేశ్వర్రావు, దేశంశెట్టి శంకర్, వాసుపల్లి శ్రీనివాసరావు, చేపల శ్రీరాములు, బలిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలతోనే సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలి

### అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు




మాట్లాడుతున్న ఎం.అప్పలరాజు

గొలుగొండ : ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పోస్టులను అర్హులైన అంగన్వాడీ కార్యకర్తలతోనే భర్తీ చేయాలని అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. జిల్లాలో ఉన్న 45 మంది సూపర్‌వైజర్లను ఏజెన్సీకి బదాలాయించడం, కాంట్రాక్టు సూపర్‌వైజర్లకు సంవత్సర కాలంగా జీతాలు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. సాంకేతికపరంగా తీవ్ర ఒత్తిడితో కూడిన పని భారాన్ని అధిగమించడానికి తగినంత మంది సిబ్బంది లేరన్నారు. సిబ్బందిని నియమిస్తూ సూపర్‌వైజర్ పోస్టుల్లో కనీసం 50 శాతం అర్హులైన అంగన్వాడీలతోనే భర్తీచేయాలన్నారు. విద్యుత్ బిల్లులకి సంబంధించి ప్రభుత్వం త్వరితగతిన స్పందిచాల్సి ఉందన్నారు. పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు ఏడబ్ల్యూసిలకు కల్పించాలన్నారు. సమావేశంలో కె.భవానీ, ఎన్‌వివి.లక్ష్మి, జయకుమారి, సిహెచ్.వరలక్ష్మి, హుకుం పేట వరలక్ష్మి, ఎం.నాగలక్ష్మి, ఆయాలు సూర్య,నాగమణి, రమణమ్మ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటేషన్‌లో బంగారు పతకాలు



కొయ్యూరు : ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటేషన్‌లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదుగురు బంగారు పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.రామారావు, చిత్రలేఖన ఉపాధ్యాయుడు పి.రమేష్ తెలిపారు. గత వారం చోడవరంలో చిత్రకళా నిలయం వారి ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలలో వి.పాండు, ఎ.జాన్, కె.స్వాతి, ఎస్.నాగశంకర్, పి.చిక్కాల రాణి ప్రభుత్వ పాఠశాల నుండి ఈ చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచి బంగారు పతకాలు, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు చేతుల మీదుగా అందుకున్నారని వారు తెలిపారు. విద్యార్థుళకు పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఎంఇఒ బోడం నాయుడు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## వైయస్ఆర్‌సీపీ పార్టీ ఆధ్వర్యంలో వెబ్‌సైట్ ప్రారంభం



విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ప్రజల సమస్యలను ప్రతిబింబించేలా డాక్యుమెంటరీ అండ్ పార్టీ ఫిలిం కాంటెస్ట్ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి వినూత్నమైన ఆలోచన మేరకు ఈ కాంటెస్ట్ నిర్వహించే బాధ్యత వైఎస్ఆర్‌సీపీ వైజాగ్ ఐటీ వింగ్ చేపట్టింది. ఈ కార్య క్రమంలో పోటీలకు సంబం ధించిన వెబ్‌సైట్‌ను విజయ సాయిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. మరిన్ని వివరా లకు 91 7659864170 ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

## కవి సమయం

### జన్మ సాఫల్యం

అన్ని జన్మలలో కంటే ఉత్కృష్టమైన,
అతి దుర్లభమైన మానవ జన్మను పొంది
నమో విశ్వరూపాయ నమ: అను రీతిన
ఆ పరమాత్మను గుర్తెరిగి
ఉపాసించలేని జీవితం వ్యర్థం
నామ, రూప, గుణ రహితమైన
ఆ పరబ్రహ్మమును దర్శించడమే
మన జీవిత లక్ష్యం, గమ్యం పరమావధి కావాలి
హృదయమును వివేకపూరితంగా,
ఆత్మను మలిన రహితంగా చేసుకొని
కఠినమైన తపస్సుతో, సాధనతో
అరిషడ్వర్గములను లోబర్చుకొని,
దుష్ట సంస్కారములను రూపు మాపుకొని
పరమాత్మను దర్శించి
జన్మ సాఫల్యం పొందడమే మన కర్తవ్యం

సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : అమావాస్య; తిథి:ఉ.9.12
హస్త మ. 1.04 వ.రా. 8.53ల 10.27

మంగళవారం 09-10-2018

a **మేషం** : ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.

b **వృషభం** : ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్, కంప్యూటర్ రంగాల వారికి ఆశాజనకం. ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది.

c **మిథునం** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తితీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

d **కర్కాటకం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి.

e **సింహం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు పనివారలతో సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** :ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.

k **కుంభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది.

L **మీనం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

# ప్రజా రంజక పాలనే లక్ష్యం...

- కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు ....
- 2019లో అధికారమే లక్ష్యంగా పనిచేద్దాం
- విశాఖలో 15 స్థానాలూ గేలుపే ధ్యేయం
- ప్రజాసంకల్ప యాత్రకు అపూర్వ ఆదరణ లభిస్తోంది...
- చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ ఆర్థిక నేరగాళ్లే..
- ఆయన దోచుకున్న సొమ్ముతో రాష్ట్రంలోని సమస్యల న్నీ తీరిపోతాయి....
- వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి




విశాఖపట్నం: ప్రజా రంజక పాల న అందించడమే తమ పార్టీ ధ్యేయమని వైసీపీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యులు విజయసాయిరెడ్డి తెలిపారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో ప్రజాసంకల్ప యాత్ర విజయవంతం అయిన సందర్భంగా సోమవారం నగరంలోని విశాఖ ఫంక్షన్ హాలు లో ఆత్మీయ సభను నిర్వహించారు. వైపీసీ నగర అధ్యక్షుడు మళ్ల విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల ను తెలుసుకునేందుకు వైసీపీ అధినేత జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర దిగ్విజయంగా కొనసాగుతోందన్నారు. గత యేడాది నవంబరు 6వ తేదీన ప్రారంభమైన ప్రజాసంకల్ప యాత్ర ఇప్పటికే 11 జిల్లాలో పూర్తయి, 12వ జిల్లాలో దిగ్విజయంగా కొనసాగుతోందన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ముఖ్యంగా మూడు ప్రధాన ఘట్టాలు చోటుచేసుకున్నాయన్నారు. వాటిలో ప్రకాశం బ్యారేజీ వద్ద పాదయాత్ర, గోదావరి బ్రిడ్జిపై పాదయాత్ర, విశాఖలోని కంచరపాలెంలో నిర్వహించిన బహిరంగ సభ అని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా విశాఖలో బహిరంగ సభ జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో జగన్ చేపట్టిన పాదయాత్రకు అపూర్వ ఆదరణ లభించిందని తెలిపారు. విశాఖ ప్రజలు జగన్‌కు బ్రహ్మరథం పట్టారన్నారు. దీనిలో కార్యకర్తల కృషి ఎనలేనిదన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు వంటివారని, ఇదే స్ఫూర్తితో పనిచేసి వచ్చే సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో గేలుపే క్ష్యంగా కృషిచేద్దామన్నారు. నాలుగున్నర సంవత్సరాలు గా పార్టీకి వెన్నుముఖలా నిలిచారని, మరో ఏడు నెలల పాటు ఇదే విధంగా కష్టించి పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని 15 అసెంబ్లీ స్థానాల్లోను పార్టీ జెండా ఎగురవేసేందుకు శాయశక్తులా కృషిచేద్దామన్నారు.

చంద్రబాబు ఓ దొంగ..విదేశాలకు పారిపోయే అవకాశం ఇవ్వకండి..

ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ దొంగని..ఈ నాలుగు సంవత్సరాలుగా సుమారు 4క్షల కోట్లకు పైగా ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఓ విజయ్ మాల్యాలా చంద్రబాబు విదేశాల కు పారిపోయే అవకాశం ఇవ్వవద్దని కేంద్రానికి సూచించారు. చంద్రబాబు దోచుకున్న ధనంతో రాష్ట్రంలోని సమస్యలన్నీ తీరిపోతాయన్నారు. వైసీపీ నగర అధ్యక్షుడు మళ్ల విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ అర్హులుశీదరూ ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. ఓటర్లలో జాబితాలో సవరణకు అవకాశం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఓటర్ల నమోదుపై కార్యకర్తలంతా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వి.వి.సత్యనారాయణ, పార్లమెంట్ అధ్యక్షుడు తైనాల విజయ్ కుమార్, నగర మహిళాధ్యక్షురాలు గరికిన గౌరి, సిటీ జనరల్ సెక్రటరీ బొడ్డేటి అనూరాధ, ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలు, వంశీ కృష్ణ శ్రీనివాస్, కెకె రాజు, డాక్టరు పైడి వెంకట రమణమూర్తి, టి.నాగిరెడ్డి , విజయ నిర్మల, శ్రీనివాసు, నాయుకులు ఐహెచ్.ఫరూఖీ, రవిరెడ్డి, దివాకర్ పక్కి, అనుబంధ సంఘాల అధ్యక్షులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫీజు రీయంబర్స్ మెంట్ అందక మధ్యలోనే చదువు ఆపివేసిన కుమారి జ్యోతి స్వరూపకు నగర పార్లమెంటరీ సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ సొంత నిధులతో 1 లక్ష 1 వెయ్యి చెక్కును అందజేస్తున్న వైఎస్ఆర్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి, ముఖ్య నాయకులు,

# కేంద్ర ప్రభుత్వ అదనపు, గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది 'గురువు శెట్టి'



విశాఖపట్నం: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది చెల్లుబోయిన గురువుశెట్టి విశాఖ పట్నం కేంద్ర ప్రభుత్వ అదనపు ప్రభుత్వ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ న్యాయమంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నారు. జిల్లా పరిధి లోని కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని సివిల్ వివాదాలపై ఈయన ప్రభుత్వం తరుపున కేసుతు వాదించనున్నారు. ఈ సందర్భంగా ఈయన ఎం.పి. కె. హరిబాబు, ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, విశాఖ బిజెపి అధ్యక్షుడు ఎం. నాగేంద్ర, బిజెపి ప్రతినిధి జె. పృద్విరాజ్, పి.వి. నారాయణరావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈయన గత 28 సంవత్స రాలుగా విశాఖపట్నం బార్ ఆసోసియేషన్ న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. బిజెపి విశాఖపట్నం లీగల్ సెల్ కన్వీనర్ కో కన్వీనర్‌గా 9 ఏళ్ళపాటు సేవలందించారు. ఈయన నియామకం పట్ల విశాఖపట్నం బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు బండారు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పి. అనురాధ, సీనియర్ న్యాయ వాదులు కదిరి రాము, బైపా అరుణ్‌కుమార్, గుడిపల్లి సుబ్బారావు, కె.ఎస్. సురేష్ కుమార్, జె.ఎ. నాయుడు, వెంకట అప్పలనాయుడు, పాకా సత్యనారాయణతో పాటు పలువురు న్యాయ వాదులు, బిజెపి నాయుకులు ప్రతి నిధులు స్నేహితులు హర్షం వ్యక్తంచేశారు.



***పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మెరైన్ పోలీస్ స్టేషన్ అధికారులు పూడిమడక గ్రామంలో గల జెడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థులకు, గ్రామ ప్రజలకు మెరైన్ పోలీసు విధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు, మత్స్యకారులు పాల్గొన్నారు.***

## గ్రామీణ ప్రాంతాలు ప్రాచీన వంటకాలు కాంటెస్ట్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో ఆంధ్ర ప్రదేశ్ టూరిజం వారి ప్రాజెక్ట్ సంస్కృతిలో భాగంగా యాక్సెస్ లవ్లీ హుడ్ హైదరాబాద్ భాగంగా పర్యాటక రంగంలో జీవనోపాదుల రూపొందించడానికి మరియు మన ప్రాంత వంటకాలను పర్యాటకులకు పరిచయం చేయాలని చేస్తున్న విన్నూతన వంటల పోటీలు కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్ లో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ వి రమణ మూర్తి మరియు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తిక్కాడ తాతారావు మరియు గ్రామ పెద్దలు హాజరైనారు. ఈ పోటీల్లో దాదాపు 23 మంది మహిళలు పాల్గొన్నారు. వీరు మన ప్రాంత వంటకాలను శాఖాహారం మరియు మాంసాహార వంటకాలతో పోటీని రక్తి కట్టించారు. సంప్రదాయ వంటకాలను వండారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కరణం శ్రీదేవి మరియు కడిమిశెట్టి భాగ్యలక్ష్మి మరియు ఆంగ్ల ఉపాధ్యాయులు సిద్ధాంత బెన్ జాన్సన్ పాల్గొన్నారు. యాక్సెస్ లవ్లీ హుడ్ కన్సల్టింగ్ ఇండియా లిమిటెడ్ వారి తరపు నుంచి ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ అభి రామ్ మరియు సౌజన్య ఈ కార్యక్రమాలకు నిర్వహించారు. అనంతరం పోటీలలో పాల్గొన్న వారందరికీ జ్ఞాపికలను అందచేశారు.

## భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి



కొయ్యూరు: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి జి.బోడంనాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన మండలంలోని రావణాపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక అమలు తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, నాణ్యతలో రాజీ లేకుండా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

## 12న పిఆర్‌సి కమిషనర్ విశాఖలో పర్యటన

విశాఖపట్నం : 11వ పే రివిజన్ కమిషన్ (పిఆర్‌సి) కమిషనర్ ఈ నెల 12వ తేదీ (శుక్రవారం) విశాఖజిల్లాలో పర్యటించి, సమావేశాన్ని నిర్వహించనున్నారని, పిఆర్‌సి కమిషన్ సెక్రటరీ కె.వి.ఎస్.కె.ఎస్. పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు సర్వీస్ అసోసియేషన్లు, పెన్షనర్ల అసోసియేషన్లు మరియు యూనివర్శిటీలకు చెందిన అసోసియేషన్లకు చెందిన ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి సర్వీసు మేటర్లు, సాధారణ అంశాలపై చర్చించడం, వారి యొక్క సలహాలను, సూచనలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

## సత్యదేవుని సన్నిధిలో సాయి సేవక్‌లు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో సామర్లకోట శ్రీ ఆంధ్రా సాయిగీతా సమాజం ఆద్వర్యంలో షిర్డీ సాయిబాబా శతాబ్ది సమాధి మహోత్సవాలను పురష్కరించుకొని గ్రామంలో స్థానిక జూనియర్ కళాశాల నుండి గ్రామ పురవీధులు గుండా సాయి భక్తులచే బిక్షాటన చేస్తూ సాయి దర్శనము కల్పించారు. అనంతరం శ్రీ సాయి సేవక్ సభ్యులు అందరూ శ్రీ సత్యదేవున్ని దర్శించారు. అనంతరం శ్రీ సాయి సేవక్‌లు మాట్లాడుతూ ఇప్పటి వరకు 53 వారాలు పూర్తి చేసుకొని 54 వ వారం అన్నవరంలో చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి సేవక్ సభ్యులతో పాటు మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్యనారాయణ కుటుంబ సభ్యులు బొమ్మిడి.ప్రకాష్, బొమ్మిడి.బాబ్జి, బొమ్మిడి.కన్నబాబు మరియు జెట్టి.సింహాద్రి, పడాల.సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన సేవలు అందించండి ఆర్డీవో వసంతరాయుడు

పెద్దాపురం: ప్రభుత్వ ఆసుపత్రులలో పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టడానికి సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు బంగారుబాబు అధ్యక్షతన రెవెన్యూ డివిజనల్ అధికారి ఎన్.ఎస్.వి.బి. వసంతరాయుడు సమక్షంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్డీవో ఆసుపత్రికి వచ్చిన నిధులు, వాటి వినియోగం అలాగే ఆసుపత్రికి సమకూర్చుకోవలసిన వసతులు, తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఆర్డీవో దీనికి స్పందించి మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికాంత్, డాక్టర్ దీపిక, అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 10 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవొ ఎన్.ఎస్వి.బి. వసతంరాయుడు తెలిపారు.

## జాతీయ రెజ్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్ధి



కొయ్యూరు : జాతీయ రెజ్లింగ్ పోటీలకు మండలం లోని కాకరపాడు గురుకుల కళాశాల విద్యార్ధి లోతా లోవ ప్రసాద్ ఎంపి కయ్యారు. సిఎం కప్‌లో భాగంగా తిరుపతిలో నిర్వహించిన రెజ్లింగ్ 67కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన లోవప్రసాద్ జాతీయ పోటీలకు సైతం అర్హత సాధించాడు. కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం(సిఇసి) చదువుతున్న లోవవరప్రసాద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సత్యరాజులు, పిడి సంతోషికుమారి, ఇతర సిబ్బంది అభినందనలు ముంచెత్తారు.

# వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక రాఘవేంద్ర రెసిడెన్సీహాలు నందు సోమవారం వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజక వర్గం విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంటు సభ్యులు వైవి.సుబ్బారెడ్డి హాజరైన ఈ సమా వేశానికి ప్రత్తిపాడు నియోజకవర్గం కో.ఆర్డినేటర్ పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ మరియు జిల్లా పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల. కుమార్ రాజా మరియు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరైనారు. ఈ సందర్భంగా వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంటు సభ్యులు వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ మద్య మొదలు పెట్టిన రావాలి జగన్-కావాలి జగన్ గడపగడపు కార్యక్రమంలో భాగంగా వైయస్. జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలు కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో గత 4 1/2సంవత్సరాలలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు పాలన రాక్షస పాలన సాగిస్తుందని అలాగే రాష్ట్రంలో ఏ ఒక్క వర్గానికి న్యాయము చేస్తాలేదని అందరినీ తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నారని బాబు వస్తే జాబు వస్తుందన్నారు. బాబు వచ్చిన తరువాత వాళ్ళ అబ్బాయి లోకేష్‌కి మాత్రమే జాబు వచ్చిందన్నారు. ఈ సమావేశం అనంతరం అన్న వరం విచ్చేసిన వైవి.సుబ్బారెడ్డిని ఘనంగా సన్మా నించినారు. ఈ కార్యక్రమంలో వైయస్‌ఆర్ కాం గ్రెస్ పార్టీ మండలస్థాయి నాయకులు, కార్య కర్తలు మరియు స్థానిక నాయకులు రాయవరపు .భాస్కరరావు, సరమర్ల.మధుబాబు, బీఎస్వీ. ప్రసాద్, బత్తుల. రవికుమార్, కొండపి. అప్పారావు, తాటిపాక.కృష్ణ, కొల్లు.గణేష్, కొల్లు.చిన్న, తాడి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రెండవ పంటకు సాగునీరు

### ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

పెద్దాపురం: రైతాంగానికి పురుషోత్తపట్నం ద్వారా రెండవ పంటకు సాగునీరు అందిస్తామని ఉపముఖ్యమంత్రి చినరాజప్ప తెలిపారు. సోమవారం మండలంలోని గోరింటలో పిఆర్ మరియు ఆర్ఒ రూ. 60 లక్షల నిధులతో గోరింట నుండి మల్లాం వరకు నిర్మిస్తున్న తారు రోడ్డుకు మంత్రి శంఖుస్థాపయ చేశారు. అనంతరం రామాలయం వద్ద ఎంపిడిఒ పి. వసంతమాధవి అధ్యక్షతన గ్రామదర్శిని - గ్రామసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గోదావరి జలాలను ఏలేరు నదిలో అనుసందానం చేయడం ద్వారా రెండవ పంటకు కూడా నీరందిస్తామని అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించడానికి రైతులు ముందుకు వస్తే ఎకరానికి రూ. 30 లక్షలు చొప్పున 5 ఎకరాలు కొనుగోలు చేస్తామని ఆ కాలనీకి రైతుపేరుపెడతామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పనులు, అంగన్‌వాడి కేంద్రాలు పనితీరు, హాస్టల్స్ నిర్వహణ, ప్రభుత్వ వైద్య సేవలు, ప్రకృతి వ్యవసాయం, తదితర శాఖల వివరాలను సంబంధిత అధికారులు, సిబ్బందితో గ్రామసభలో వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఎఎస్‌డబ్ల్యుఒ గాయత్రి, పంచాయతీరాజ్ డిఇ ఎహరినాధరావు, నీటి సంఘ డైరెక్టర్ పి. యేసు, సొసైటీ డైరెక్టరు పి. దొరబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పి. సత్తిబాబు, జిడివై అధ్యక్షులు పి సతీస్, తుమ్మలరాజా, కె. కోటి, మాజీ సర్పంచ్‌లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ ఫోర్ట్ దగ్గర ప్రార్కింగ్ స్థలం కేటాయించాలి



విశాఖపట్నం: విశాఖ నగరంలో 2వేల మంది క్యాబ్స్ నడుపుతూ స్వయం ఉపాధి కల్పించుకుంటు జీవనం గడుపుతున్నారు. ఎయిర్‌పోర్టు అధారిటీ వారికి గతంలో అనేకసార్లు ఫ్రీ పార్కింగ్ సౌకర్యం కల్పించమని విజ్ఞప్తి చేసారు. గతంలో 10ని॥లలో లోపలికి వెళ్ళివస్తే పార్కింగ్ ఫీజు చెల్లించాల్సినవసరం లేదు. గత రెండు వారాల నుండి ఎయిర్‌పోర్టు లోపలకి వెళ్ళి వస్తే రూ.55లు కట్టాలని నిబంధన పెట్టారు. ప్రస్తుతం వసూలు చేస్తున్న పార్కింగ్ ఫీజును రద్దుచేయవలసిందిగా కోరుతూ, టోల్‌గేట్ ఫీజును రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్ కు వినతిపత్రం అందచేశారు.

# వృత్తిదారుల ఛలో కలెక్టరేట్

**- వృత్తిదారులందరికి ఆదరణ-2 పథకం అమలు చేయాలి - రూ. 2లక్షల హామీలేని రుణం ఇవ్వాలి**




విశాఖపట్నం: వృత్తిదారులందరికి ఆదరణ-2 పథకం అమలు చేయాలి. 2లక్షల హామీలేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు వృత్తిసంఘాల ఆధ్వర్యంలో జగదాంబ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముందు బైటాయించగా పోలీసులతో వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎ.పి మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, ఎ.పి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు, ఎ.పి రజకవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, ఎపి. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడారు.

ఆదరణ పథకంలో అందరికీ పరికరాలు ఇస్తామని చంద్రబాబు ప్రభుత్వం గద్దెనెక్కిన దగ్గర నుండి వృత్తిదార్లను ఊరిస్తూనే వుంది. ఆన్‌లైన్ అంటూ వృత్తిదార్లను నానా తిప్పలు పెట్టారు. నాలుగున్నర సంవత్సరాల యినా ఇప్పటి వరకు సబ్సిడీ రుణం లేదు. ఆదరణ పరికరాలు రాలేదు. ఇప్పటికే 10% లబ్దిదార్ల వాటా క్రింద వసూళ్ళు చేసుకున్న ప్రభుత్వం మరో 20% రుణం క్రింద కట్టాలని లోన్ డాక్యూమెంట్‌పై సంతకాలు చేసుకుంటున్నది. ఇలా తంతు నడుపుతున్నది తప్ప ఇంత వరకు ఎవరికీ రుణం. పరికరాలు ఇవ్వలేదు. 90% సబ్సిడీతో లక్ష రూపాయలు ఎటువంటి షూరిటీ (హామీ) లేకుండా వృత్తిదార్లందరికీ రుణం ఇస్తామని ఎన్నికల్లో చెప్పి గద్దెనెక్కారు చంద్రబాబు. బ్యాంకులు షూరిటీ లేనిదే రుణం ఇవ్వం అంటున్నాయి. రకరకాలు షరతులు పెట్టి లక్షలాది మంది వృత్తిదారులను ప్రభుత్వం అనర్హులను చేసింది. మత్స్యకారులు, గొర్రెల, మేకల పెంపకందారులను ఆదరణ-2 పథకంలో లేకుండా చేశారు. ప్రభుత్వం వెంటనే వీరిని ఆదరణ-2లో చేర్చాలి. వృత్తిదారులందరికి పరికరాలు, అందరికీ హామీలేని రూ.2లక్షల రుణం 90% సబ్సిడీతో ఇవ్వాలని, ఆదరణ 2లో వృత్తిదార్లందరికీ బ్యాంక్‌లోన్ లేకుండా వారు కోరిన పరికరాలు ఇవ్వాలని, 50 ఏళ్ళు దాటిన వృత్తిదార్లందరికీ నెలకు 3వేలు పెన్షన్ ఇవ్వాలని విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కల్లుగీత కార్మికులకు హుదూద్ నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. వెంటనే ఆదరణ పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. లేకుంటే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరిస్తున్నాం. అనంతరం జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష/కార్యదర్శులు చోడిపిల్లి అప్పారావు,చోడిపల్లి గంగరాజు, కల్లుగీత కార్మిక సంఘం ఎన్.నూకరాజు, రజకవృత్తిదారుల సంఘం నాయకులు ఎస్.సత్యనారాయణ, వి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పెండింగు సమస్యల పరిష్కారానికై

# నిరవధిక సమ్మెలోకి కార్మికులు



విశాఖపట్నం : పర్మినెంట్ ఉద్యోగులు మరియు కాంట్రాక్టు/అవుట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగు సమస్యల పరిష్కారానికై నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు కార్మికులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వాలు ఏమిచేసినా అవి రాజ్యాంగం మరియు చట్టాల పరిధిలోనే ఉండాలి. కాని ప్రభుత్వం తెచ్చిన 279 జీవో కార్మికుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తుంది. జివిఎంసి ప్రజాధనం కాంట్రాక్టర్ల చేతలూటీ చేయబడుతుంది. ప్రజలపై యూజర్ చార్జీలు భారాలు పడతాయి. 74 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకిచ్చిన అధికారాలు కాలరాయబడతాయి. ప్రజారోగ్యం, ప్రజలకు సేవలు ప్రభుత్వ బాధ్యత! కాని వాటి నుండి తప్పించుకొని కాంట్రాక్టర్ల పరం చేయటం ద్వారా 47వ ఆర్టికల్ ఉల్లంఘించబడుతుంది. కాబట్టి 279 జీవోను రద్దు చేయాలి. శాశ్విత స్వభావం కలిగిన విధుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు/ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన వేతనాలు చెల్లించాలని సుప్రీంకోర్టు సివిల్ అప్పీలు నెం=213/2013లో పేర్కొన్నది. 2015, 2016,2017 సం॥లలో సిఐటియు నిర్వహించిన సమ్మెలు మరియు అనేక ఆందోళనల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. 2016లో ఇచ్చిన 151 జీవో ప్రకారం 12,000రూ॥లు జీతాలు ఏరియర్స్‌తో ఇంతవరకు అమలు చేయలేదు. హామీలు అమలు చెయ్యాలని స్థానికంగా పెండింగులో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చినా సమ్మెపై స్పందన రాలేదు. కాబట్టి గత్యంతరం లేని స్థితిలో రాష్ట్ర మున్సిపల్ జెఎసి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయాలని పిలుపునిచ్చింది. కావున జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరుతున్నాము. మున్సిపల్ కార్మికుల సమ్మె 5వ రోజుకు చేరుకుంది.

ఈ సందర్భంగా శాసన సభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్‌కి వినతిపత్రం అందజేసారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలపై సిఎంతో మాట్లాడతని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, ఎం.ఈశ్వరరావు, పి.అప్పలరాజు, కిశోర్, అనిత, ఎస్.రత్నం, ధన, కార్మికులు పాల్గొన్నారు.

డిమాండ్స్ : 1) ప్రజాధనాన్ని దుర్వినియోగ పరిచి, కార్మికుల కడుపులు కొట్టే 279 జీవోను రద్దు చేయాలి.

2) ఎన్ఎంఆర్, ఎంటిఎస్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చెయ్యాలి.

3) సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానవేతనాలు (19000) నేరుగా చెల్లించాలి.

4) ఉద్యోగులకు 010పద్దు వేతనాలు ప్రభుత్వమే చెల్లించాలి.

5) సిపిఎస్ రద్దు చెయ్యాలి. హెల్త్ కార్డులు అమలు చేయాలి.

6) జనాభా ప్రకారం సిబ్బందిని పెంచి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి.

7) ఉద్యోగులు, కార్మికులకు మున్సిపల్ కాలనీలు నిర్మించాలి.

8) కాటగిరిల ప్రకారం సెమిస్కిల్డు, స్కిల్డు వేతనాలు చెల్లించాలి.

## చిత్రభాను

# సూపర్ హిట్లు మిస్సయ్యారు



చిత్రసీమలో విజయాలు దోబూచులాడుతుంటాయి. కొన్నిసార్లు మంచి అవకాశాలు అందినట్లే అంది చేజారిపోతుంటాయి. అలా కొంతమందికి చేజారిన సినిమాలు మరికొందరికి అదృష్టంగా మారుతుంటాయి. సమయానుకూలంగా తీసుకున్న నిర్ణయాలు సినీరంగంలో నాయకానాయికల కెరీర్‌ను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. వారి భవితవ్యాన్ని మారుస్తాయి. ఒకరు చేయాల్సిన సినిమా అవకాశాలు మరొకరికి దక్కడం అనేది చిత్రసీమలో పరిపాటే. అయితే కొన్ని సందర్భాల్లో ఆ నిర్ణయాలు కొందరికి ఖేదాన్ని మిగిలిస్తే మరికొందరికి సంతోషాల్ని పంచుతాయి. ఇటీవల కాలంలో విజయవంతమైన సినిమాలు చేజార్చుకున్న కొందరు నాయకానాయికలు ఉన్నారు.



తమిళ చిత్రం చెక్క చివంతవానం(తెలుగులో నవాబ్)తో పూర్వవైభవాన్ని దక్కించుకున్నారు విలక్షణ దర్శకుడు మణిరత్నం. అరవిందస్వామి, శింబు, అరుణ్‌విజయ్, జ్యోతిక ప్రధాన పాత్రధారులుగా మల్టీస్టారర్ కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధిస్తున్నది. తొలుత ద్విభాషా చిత్రంగా తెలుగు, తమిళ స్టార్స్‌తో ఏకకాలంలో ఈ సినిమాను తెరకెక్కించాలని మణిరత్నం భావించారు. తెలుగు వెర్షన్ కోసం ముగ్గురు హీరోల్లో ఓ పాత్ర కోసం రామ్‌చరణ్‌ను సంప్రదించినట్లు తెలిసింది. కానీ ప్రతినాయక ఛాయలతో సాగే పాత్ర కావడంతో రామ్‌చరణ్ ఈ సినిమాను తిరస్కరించినట్లు సమాచారం. నానికి సైతం మణిరత్నం ఈ కథను వినిపించారు. కానీ ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో నాని ఈ సినిమా తిరస్కరించినట్లు తెలిసింది. ద్విభాషా సినిమా వర్కవుట్ కాకపోవడంతో ఈ సినిమాను తెలుగులో అనువాద రూపంలో విడుదలచేశారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం చక్కటి విజయాన్ని సొంతం చేసుకుంది.

**గీత పాత్ర కోసం..**

విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న జంటగా పరుశురామ్ దర్శకత్వంలో రూపొందిన గీతగోవిందం చిత్రం వందకోట్ల మైలురాయిని దాటి బాక్సాఫీస్ వద్ద సంచలనాల్ని సృష్టించింది. కుటుంబ బంధాలకు వినోదం, ప్రేమకథను మిళితం చేసి రూపొందిన ఈ చిత్రంలో విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్నల



కెమిస్ట్రీ అందరిని అలరించింది. ఈ సినిమాలో రష్మిక మందన్న పాత్ర కోసం తొలుత లావణ్య త్రిపాఠిని తీసుకున్నారు. ఆమెపై ఫొటోషూట్‌తో పాటు కొన్ని సన్నివేశాలను చిత్రీకరించినట్లు తెలిసింది.

అనివార్య కారణాల వల్ల అర్ధాంతరంగా ఆమె తప్పుకోవడంతో రష్మికకు ఈ అవకాశం దక్కింది. దాంతో లావణ్య ఖాతా నుంచి ఓ పెద్ద హిట్ మిస్ అయ్యింది. విశాల్ కథానాయకుడిగా తెరకెక్కిన డిటెక్టివ్ చిత్రం తెలుగు, తమిళ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నది. ఓ నరహంతక ముఠాను తన తెలివితేటలతో పట్టుకునే అద్వైతభూషణ్ అనే డిటెక్టివ్ కథతో ఉత్కంఠభరితంగా దర్శకుడు మిస్కిన్ ఈ సినిమాను మలిచారు. ఇందులో అభినయానికి ఆస్కారమున్న ఓ డీగ్లామర్ రోల్‌లో అను ఇమ్మాన్యుయేల్ నటించింది. అయితే తొలుత ఈ పాత్ర కోసం రకుల్‌ప్రీత్‌సింగ్‌ను ఎంచుకున్నారు. కానీ కథలో తన పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేదనే ఆలోచనతో రకుల్ ఈ సినిమా చేయడానికి ఒప్పుకోలేదు. దాంతో ఆమె స్థానంలో అను ఇమ్మాన్యుయేల్ నటించింది. ఈ సినిమాతో తమిళ చిత్రసీమకు పరిచయమైంది అను ఇమ్మాన్యుయేల్. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తొలిప్రేమ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకున్నది. ముఖ్యంగా రాశీఖన్నా నటనకు చక్కటి పేరు వచ్చింది. అభినయానికి ప్రాధాన్యమున్న పాత్రలకు ఆమె న్యాయం చేయగలదని ఈ చిత్రం నిరూపించింది. ఈ సినిమాలో కథానాయికగా మెహరీన్ నటించాల్సింది. కానీ అదే సమయంలో ఆమె ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో డేట్స్ సర్దుబాటు కాక వదులుకుంది. దాంతో రాశీఖన్నాకు ఈ అదృష్టం దక్కింది. ఈ సినిమాతో కెరీర్‌లో పెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది రాశీఖన్నా.

**అర్జున్‌రెడ్డి గా మరొకరు..**

తెలుగు చిత్రసీమలో సంచలనం సృష్టించింది అర్జున్‌రెడ్డి. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం కల్ట్ మూవీగా దేశవ్యాప్తంగా సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ధిక్కార స్వభావుడు, కోపిష్టి యువకుడిగా విజయ్‌దేవరకొండ అభినయానికి సర్వత్రా ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం అర్జున్‌రెడ్డి చిత్రాన్ని హిందీ, తమిళంతో పాటు పలు భారతీయ భాషల్లోకి రీమేక్ చేస్తున్నారు. కాగా ఈ సినిమాను తొలుత శర్వానంద్‌తో చేయాలని భావించారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఆయనకు కథను వినిపించారు. కానీ వరుస విజయాలతో దూసుకుపోతున్న తరుణంలో ప్రయోగాలు చేయడానికి సాహసం చేయలేదు శర్వానంద్. అలా ఈ సినిమాలోకి శర్వానంద్ స్థానంలో విజయ్ దేవరకొండ వచ్చిచేరారు. ఈ సినిమాతో విజయ్ దేవరకొండ స్టార్‌హీరోగా మారిపోయారు. అలాగే ఇటీవల చిన్న సినిమాల్లో పెద్ద విజయాన్ని సాధించిన



ఆర్ఎక్స్ 100 సినిమాను తొలుత విజయ్‌దేవరకొండతో చేయాలని భావించారు దర్శకుడు అజయ్‌భూపతి. ఆయనకు కథ వినిపించారు. కానీ అర్జున్‌రెడ్డి ఛాయలతో ఈ కథ సాగడంతో విజయ్ ఈ సినిమాను తిరస్కరించినట్లు తెలిసింది. ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ పురస్కారాన్ని అందుకొని తెలుగు చిత్రసీమఖ్యాతిని చాటిన చిత్రం శతమానంభవతి. దిల్‌రాజు నిర్మాణంలో సతీష్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం శర్వానంద్ కెరీర్‌లోనే పెద్ద విజయాన్ని సాధించింది. ఈ సినిమాను రాజ్‌తరుణ్‌తో చేయాలని చిత్రబృందం భావించారు. అతడితో ఈ సినిమా చేస్తున్నట్లు దిల్‌రాజు స్వయంగా ప్రకటించారు. కానీ సెట్స్‌పైకి వచ్చే సమయానికి రాజ్‌తరుణ్ స్థానంలో శర్వానంద్ హీరోగా వచ్చారు.

నాగార్జున, కార్తీ కథానాయకులుగా వంశీపైడిపల్లి దర్శకత్వంలో రూపొందిన ఊపిరి సినిమాలో తొలుత హీరోయిన్‌గా శృతిహాసన్ నటించాల్సింది. అనూహ్యంగా ఆమె తప్పుకోవడంతో తమన్నాను హీరోయిన్‌గా తీసుకున్నారు చిత్రబృందం. ప్రేమమ్ తెలుగులో రీమేక్‌లో ఈ సినిమా మలయాళ మాతృకలో నటించిన సాయిపల్లవి నటించాల్సింది. కానీ వ్యక్తిగత కారణాల వల్ల ఆమె అంగీకరించలేదు. దాంతో ఆమె పాత్రలో శృతిహాసన్ నటించింది. ఇలా ఒకరికి చేజారిన అవకాశాలు మరొకరికి అద్భుత విజయాల్ని అందించాయి. అయితే పరిశ్రమలో ఈ సమీకరణాలన్నీ సాధారణమే అయినప్పటికీ ఫలానా సినిమాల్ని తాము చేయలేకపోయామనే భావన మాత్రం తారల మనసుల్ని వెంటాడుతూనే ఉంటుంది.

**రంగస్థలంలో అనుపమ**

రంగస్థలంలో పల్లెటూరి రామలక్ష్మిగా అద్వితీయ అభినయంతో ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకుంది సమంత. గ్లామర్ హంగులకు దూరంగా సాగే ఈ డీగ్లామర్ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయింది. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులో నాన్ బాహుబలి రికార్డులను తిరగరాసింది. అయితే ఈ సినిమాలో కథానాయికగా నటించే అవకాశం తొలుత అనుపమ పరమేశ్వరన్‌ను వరించింది. అఆ, ప్రేమమ్ సినిమాల్లో అనుపమ నటనను ముగ్ధుడైన దర్శకుడు సుకుమార్ రామలక్ష్మి పాత్రను ఈ మలయాళీ ముద్దుగుమ్మ చేత చేయించాలని అనుకున్నారు. ఫొటోషూట్, ఆడిషన్స్ కూడా జరిగాయి. కానీ అనివార్య కారణాల వల్ల ఆమె ఈ సినిమా నుంచి తప్పుకోవడంతో సమంతను రామలక్ష్మి పాత్ర వరించింది.

**నిత్యామీనన్ చేయాల్సింది...**



అలనాటి నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చిత్రం మహానటి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ




చిత్రంలో అసమాన అభినయంతో సావిత్రి పాత్రకు ప్రాణప్రతిష్ట చేసింది కీర్తిసురేష్. చక్కటి హావభావాలు, భావోద్వేగాలు పలికించి సావిత్రిని స్ఫురణకు తెచ్చింది. ఆమె కెరీర్‌లోనే మరపురాని చిత్రంగా మహానటి నిలిచింది. అయితే సావిత్రి పాత్ర కోసం దర్శకుడు నాగ్ అశ్విన్..నిత్యామీనన్‌ను తీసుకోవాలని అనుకున్నారట. కానీ అనుకోని కారణాల వల్ల ఆమె అంగీకరించకపోవడంలో కీర్తిసురేష్‌ను అదృష్టం వరించింది. అలాగే ఈసినిమాలో జెమిని గణేషన్ పాత్ర కోసం విజయ్ దేవరకొండను తీసుకోవాలని దర్శకుడు నాగ్ అశ్విన్ భావించారు. దుల్కర్ సల్మాన్ డేట్స్ అందుబాటులో లేకపోవడంలో విజయ్ చేత ఈ పాత్రను చేయించాలని అనుకున్నారు. కానీ జెమిని పాత్ర చేయడానికి విజయ్ సంశయించడంతో తిరిగి దుల్కర్‌సల్మాన్‌ను తీసుకున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో నటించారు.

---

# ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఇంటికో సమస్య

*- ప్రజా సమస్యలు వింటుంటే అసలు మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అనిపిస్తుంది - వృద్ధులులకు పింఛన్లు సరిగా రావడం లేదు*

*- యువతకు ఉపాధి అవకాశాలు లేవు - కాలుష్య నియంత్రణ కోసం చర్యలు లేవు - వైఎస్ఆర్‌సిపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డా॥ పైడి వెంకట రమణమూర్తి*



విశాఖ సిటీ : జగనన్నకు తోడుగా రావాలి జగన్.. కావాలి జగన్.. గడప గడపకూ నవరత్నాలు కార్యక్రమం దక్షిణ నియోజకవర్గం పరిధిలోని 23వ వార్డులో వార్డు వైయస్ఆర్ సీపీ అధ్యక్షుడు అలమండ విజయకుమార్ , రాష్ట్ర యూత్ సెక్రటరీ మసి పొగురాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వార్డు నాయకులు ఏర్పాటు చేసిన దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వార్డులోని 134 , 135 , 136 బూత్ పరిధిలోని గన్నేరు వీధి , పంజా జం. కనకమహాలక్ష్మి గుడి వద్ద ముగించారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా ప్రజలు తమ గోడును వెళ్లబుచ్చుకుంటున్నారని, ఎటు చూసినా అధికార పార్టీ ధనదాహంతో ప్రజా పాలనను మరచి నియంత పాలన కొనసాగిస్తున్నారని ఆయన తెలియజేశారు. చదువుకునే యువత ఉపాధి మార్గాలు లేక కూలీ పని చేసుకుంటున్నారని, ఉన్నత చదువులు చదివి పాన్ షాపులలో టీ షాపులలో రోజువారీ కూలీతో చాలీచాలని బతుకులు బతుకుతున్నారని, వీరందరికీ సంబంధిత రంగాలలో ఉపాధిని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతంలో కాలుష్యం వలన ప్రజలకు అనేక వ్యాధులు సంభవిస్తున్నాయని, కాలుష్య నియంత్రణ పట్ల ప్రభుత్వ చర్యలు శూన్యమని ఆయన అన్నారు. వృద్దులు పలు అనారోగ్యా కారణాల వలన పింఛను కేంద్రాలకు వెళ్లలేక పోతే వారికి పింఛన్లు ఇవ్వడం లేదని వృద్ధ మహిళలు తనవద్ద వాపోతున్నారని డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్ వెస్లీ, నగర యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, కనకల ఈశ్వరరావు, లండ రమణ , బోని దేవా, పీ ఊర్వశి వార్డు మహిళ అధ్యక్షురాలు కాకి పద్మావతి , ప్రధాన శత్రు, సాయిబాబా, కోరుకొండ ప్రసాద్, గొంప భాను, ఉప్పాడ అదిబాబు, గుత్తుల నాగభూషణం, మహమ్మద్ జమీల్ మరియు అధిక సంఖ్యలో మహిళలు, యువత పాల్గొన్నారు.

---

### మావో డిప్యూటీ కమాండర్ అరెస్టు

# తూర్పు మన్యంలో మావోలకు ఎదురు దెబ్బ

కాకినాడ : ఆంధ్రా ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులలోని ఇడుమ బెటాలియన్ డిప్యూటీ కమాండర్ అరెస్టు అయ్యారు. దీంతో తూర్పు మన్యంలో కోలుకోలేని ఎదురు దెబ్బ తగిలింది. సుమారు 116 మంది వ్యక్తుల మృతికి కారకుడైన ఇడుమా బెటాలియన్ డిప్యూటీ కమాండర్ పొడియం ముడా అరెస్టు చేయడం జరిగిందని, ముడా చత్తీస్‌ఘడ్ మావోల కీలక గ్రూపు కమాండర్ ఇడుమాకు ప్రధాన అనుచరుడని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ విశాల్ గున్ని తెలిపారు. సోమవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టుల ఉద్యమంలో కీలక పాత్ర వహిస్తూ 15 కేసులలో ముద్దాయిగా ఉన్న మోస్ట్ వాంటెడ్ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన పొడియం ముడా అలియాస్ మల్లేశ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుండి 20 డిటోనేటర్‌లు , 20 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. పొడియం ముడా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా అతుల్ పరా గ్రామానికి చెందిన వ్యక్తి అని ఆతనికి భార్య నలుగురు పిల్లలు కలరన్నారు. 2005 నుండి దళంలోకి పని చేస్తున్నాడని డిప్యూటీ కమాండెంట్ స్థాయికి ఎదిగాడన్నారు. 2007 జూలై9న 26 మంది సిఆర్‌పిఎఫ్ ,2007 ఆగష్టు18 12మంది సిఆర్‌పిఎఫ్,2007 ఆగష్టు20 బట్టిగూడెం ఫారెస్టులో 12 మంది వ్యక్తులు 2008 జనవరిలో తొంగుడ లో 11 మంది వ్యక్తులు, 2008 ఏప్రిల్ బందలో 4గురు స్పెషల్ ప్రొటక్షన్ పోర్స్,2009 నవంబర్‌లో సిగనమడుగు వద్ద 6గురు సిఆర్‌పిఎఫ్ జవానులు 2010 ఏప్రిల్ 6న తడిమెట్ల వద్ద 26 మంది సిఆర్‌పిఎఫ్, వానులు 2014 జూలై25న గిరాం ఘాట్ వద్ద 29 మంది సిఆర్‌పిఎఫ్ జవానలతో పాటు మంత్రి మహేంద్ర కర్మా హత్యకేసు 2017 మార్చి11న బెజ్జి వద్ద 12 మంది సిఆర్‌పిఎఫ్ జవానులు, 2017 ఏఫ్రిల్ 24న బుర్ఖాన్‌పాల్ వద్ద 26 మంది సిఆర్‌పిఎఫ్ జవానులపై దాడి, 2018 మార్చి13న కిష్టారం పోలీసుస్టేషన్ పరిధిలోని పలోడి వద్ద జరిగిన దాడిలో 9మంది సిఆర్‌పిఎఫ్ జవానుల మృతికి కారణమయ్యాడని తెలిపారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రిక ఆవిష్కరణ

- భక్తులు విరివిగా పాల్గొన్ని అమ్మ కృపకు పాత్రులుకండి
- దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి



విశాఖ సిటీః ఈ నెల 10నుండి 18వ తేదీ వరకు బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవములు ఘనంగా నిర్వహింపబడనున్నట్లు, దానికి సంబంధించి ఎప్పుడు ఏ ఉత్సవం నిర్వహిస్తారో, ఏ తేదీన అమ్మవారికి ఏ అలంకరణ చేస్తారో తెలిపే కరపత్రాన్ని విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ కార్యాలయంలో ఉత్సవ కరపత్రిక ఆవిష్కరణ జరిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కలెక్టర్ మరియు కార్యనిర్వహణ అధికారి ఎస్‌జె మాధవి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సిహెచ్‌వి రమణ పాల్గొన్నారు.

ఈ ఉత్సవాలను బుధవారం ఉదయం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పై అలంకరణలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించవలసినదిగా ఆలయ కార్యనిర్వహణాధికారి మాధవి తెలిపారు. ఈ ఉత్సవాలలో అమ్మవారికి ప్రతి రోజు చేసే పంచామృతాభిషేకం యదావిధిగా నిర్వహిస్తూ కేవలం మధ్యాహ్నం చేసే అభిషేకం మాత్రం రద్దు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించవలసినదిగా కోరారు. పై సేవలలో పాల్గొనదలచిన భక్తులు పూర్తి వివరముల కొరకు 0891-2566514 నెంబరును సంప్రదించవలసినదిగా ఆమె కోరారు.

# ప్రమాదకర ప్రదేశాల్లో ఈతకు దిగొద్దు

## మెరైన్ సి.ఐ డి.వి.జే రమేష్ కుమార్



విశాఖపట్నంః సముద్రంలో ప్రమాదకర ప్రదేశాల్లో ఈతకు దిగడం ప్రమాదకరమని మెరైన్ పోలీస్ స్టేషన్ సి.ఐ డి.వి.జే రమేష్ కుమార్ పేర్కొన్నారు .

ఈమేరకు పోలీస్ అమరవీరుల దినోత్సవాలను పురస్కరించుకొని మెరైన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం మినర్వా పాఠశాల విద్యార్థులకు మెరైన్ పోలీసింగ్‌పై అవగహన కల్పించారు . ఈసందర్భంగా సి.ఐ డి.వి.జే రమేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా సముద్రంలో స్నానమాచరించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు . తీరంలో హెచ్చరిక బోర్డులు ఉన్న ప్రదేశంలో ఈతకు దిగడం ప్రమాదకరమన్నారు . అదేవిదంగా మద్యం మత్తులో సముద్రంలో స్నానమాచరించడం ప్రమాదకరమని గుర్తు చేశారు . తీర ప్రాంతంలో అనుకోని ఘటన జరిగిన, అనుమాన వ్యక్తులు సంచరించిన 1093 నంబరుకి ఫోన్ చేసి సమాచారమందించాలని ఈసందర్భంగా ఆయన కోరారు .

అంతకు ముందు తీరప్రాంతం అత్యవసర సమయాల్లో మెరైన్ పోలీస్‌లు వియోగించే లైఫ్ జాకెట్స్ , లైఫ్ బియాస్ , సేఫ్టీ ల్యాంప్ తదితర రెస్క్యూ పరికరాల వినియోగంపై విద్యార్థుకు అవగహన కల్పించారు .

కార్యక్రమంలో మెరైన్ ఎస్ .ఐ రమేష్ , ఎ .ఎస్ .ఐ రాజరావు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు .

# ఆశయం.. దీక్ష.. పట్టుదలతో..

# మిసెస్ ఆంధ్రగా ఎంపికైన మమత

- ఎన్నుకున్నది ఏరంగమైతేనేం
- పట్టుదల కృషి ఉంటే సాధించలేనిది లేదు
- నా కుటుంబ సహకారంతోనే ఈ ప్రోత్సాహం
- యాంకరింగ్.. మోడలింగ్.. సినీరంగంలో అనుభవం
- ఆశలు.. ఆశయాలు సఫలం చేసుకోండి
- మిసెస్ ఆంధ్రప్రదేశ్ కిరీటధారిణి మమత




*మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని.. అమ్మతనం నుండి అంతరిక్షం వరకు అన్ని రంగాలలో విజయం సాధించిన వారే .... అని మన పురాణ గాథలు పేర్కొంటున్నాయి. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన మమత అనే చిన్నారి చిన్నతనం నుండే స్కూలులో చదువు, ఆటపాటలలో ముందుండేది. అది మొదలు మమత తన మెళుకువలు, హావభావాలతో పలువురిని ఆకట్టుకుని వైజాగ్‌లో తొలి మహిళా షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందారు. తాను నిర్మాతగా మహాత్మా జ్యోతీరావుపూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తదితర సినిమాలకు గాను ఉత్తమ నిర్మాత, డైరెక్టర్‌గా నందీ అవార్డులు కూడా రాష్ట్ర ప్రభుత్వం నుండి అందుకున్నారు. అప్పటి నుండ వెనుదిరగకుండా పలు రంగాలలో విజయం సాధిస్తూ ఇటీవల జరిగిన మిసెస్ ఇండియా వరల్డ్ టైటిల్‌ను గెలుపొందిన మమత మరింతగా రాణించాలని కోరుకుంటూ..*

విశాఖపట్నం : చిన్నతనం నుంచి ఏదో సాధించాలనే తపన ధ్యేయం ముందునుంచే ఉన్నట్టు తానెప్పుడూ కలగనే దానినని ఆ కలల సాకారాన్ని తల్లిదండ్రులు గుర్తించి తనకు తగిన ప్రోత్సాహాన్నిస్తూ అవకాశాలను కలిగించే వారని మిసెస్ ఆంధ్రప్రదేశ్ కిరీటధారిణి మమత పేర్కొన్నారు. ప్రతీ దానికీ పరిమితమైన అవగాహన ఉండడంతో ఇది నా వల్ల సాధ్యం కాదనే ఊరుకునేదానిని అని విజయభాను ప్రతినిధితో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనలో ఉన్న ప్రతిభను వెలికి తెచ్చేందుకు తల్లిదండ్రులు ఎంతగానో ప్రోత్సాహాన్నిచ్చి ముందుగా చదువు విషయంలో రాణింపజేశారన్నారు. దీంతో ఆశక్తి ఉన్న రంగాల్లో ముందడుగు వేయడం ప్రారం భించానని చెప్పారు.

చిన్నతనం నుంచి తల్లిదండ్రుల ప్రోత్సహం తోనే గాక వివాహమయిన తరువాత తన భర్త ప్రోత్సాహంతో కూడా మరింత ఉజ్వల భవిష్యత్తు సాధనకు నడుంకట్టి ముందుకు అడుగేశానని ఆమె చెప్పారు. భర్తకు సినీ, మీడియా రంగాలలో పేరు ప్రఖ్యాతులుండడంతో మొదటి సారిగా యాంకర్‌గా జీవితం ప్రారంభించి అక్కడి నుండి నెనుదిరిగి చూడలేదు. ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు జేసుకుని భర్త ప్రోద్బలంతో క్రమంగా చిత్రనిర్మాణంపై అవగాహన పెంచుకుని రైట్ ఛాయిస్ అనే షార్ట్ ఫిల్మ్ తీసినట్టు ఆమె తెలియజేశారు. దీంతో లఘు చిత్రం తీసిన తొలి మహిళా డైరెక్టర్‌గా పేరొందానని అన్నారు. అదే స్ఫూర్తితో మహాత్మా జ్యోతీరావు పూలే, డాక్టర్ అంబేద్కర్ లఘు చిత్రాలను రూపొందించి వాటికి కాస్ట్యూమ్స్ డైరెక్టర్‌గా, నటిగా ఉన్నందుకు వాటికి నంది అవార్డులు వరించాయని తెలియజేశారు. సినీ రంగంలో నిలదొక్కుకున్న తరువాత మోడలింగ్ రంగంవైపు అడుగులు వేయడం ప్రారంభించి మొదటిసారిగా విశాఖలో మిసెస్ వైజాగ్ పోటీలలో పాల్గొన్నానన్నారు. కేవలం అందం, ఐశ్వర్యం ఉంటే సరిపోదని అందుకు తగిన తెలివి, సామర్థ్యంకూడా ఉండాలని ఆ దిశగా ఎంతో కృషి చేశానని ఢిల్లీలో డాజిల్ సంస్థ నిర్వహించిన పోటీలలో మిసెస్ ఇండియా వరల్డ్ పోటీల్లో పాల్గొని క్రౌన్ గెలుచుకున్నానని తన కృషి, పట్టుదల, ఆశయ సాధన ముఖ్యంగా భర్త ప్రోత్సాహం ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. తనకు ఇప్పుడు ఇద్దరు కుమార్తెలని వారు కూడా తల్లిలాగే మోడలింగ్ రంగంలో విశేష కృషి చేసి రాణిస్తున్నారని తల్లి మమత విజయభాను ప్రత్యేక ప్రతినిధికి వివరాలను వెల్లడించారు.



# ఏపీకి మరోసారి కేంద్రం మొండిచేయి

## రూ.350 కోట్ల నిధులు వెనక్కి

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపింది. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన నిధులు విడుదల విషయంలో కేంద్రం ఇంకా ఎటూ తేల్చడంలేదు. ఈ ఏడాది మార్చిలో మొత్తం ఏడు జిల్లాలకు విడుదల చేసిన రూ.350 కోట్లను మోదీ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. అంతకుముందు విడుదల చేసిన నిధులకు సంబంధించిన యూసీలు, ఖర్చుల వివరాలు అందించని కారణంగా వాటిని వెనక్కి తీసుకుంటున్నట్టు కేంద్రం గతంలో వెల్లడించింది. దీంతో తక్షణమే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలాఖరు కల్లా యూసీలు, ఖర్చుల వివరాలను అందించింది. ఆర్నెళ్లు గడుస్తున్నా ఈ నిధుల విడుదలకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.




# పరిసర ప్రాంతాలపై పట్టు సాధించాలి

కంచరపాలెం: పరిసర ప్రాంతాలపై పట్టు సాధించాలని అప్పుడే నేర నియంత్రణ సాధించగలమని నగర పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా పేర్కొన్నారు .

ఈమేరకు సోమవారం సాయంత్రం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన సుమారు మూడు గంటలపాటు సిబ్బందితో సమీక్షించారు .

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు .

అదేవిదంగా ఏరియాలలో పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న గస్తీని సంబంధిత స్టేషన్ అదికారి నిత్యం పర్యవేక్షించాలని సూచించారు .



అనంతరం పశ్చిమ జోన్ ఏసీపీ లంక అర్జున్ , కంచరపాలెం సి.ఐ అశోక్ కుమార్, ఎయిర్ పోర్ట్ జోన్ సి.ఐ మళ్ల శేషును స్టేషన్ పరిదిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు ....**

**నగర పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా ...**

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com